PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 181 | విజయవాడ, గురువారం 2 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Thursday 2 February 2023 | Rs


సాగుకు కోతలు

- కార్పొరేట్లకు ఊతం
- సహకారంపై కేంద్రం పట్టు బిగింపు
- ఎంఎస్‌పి చట్టబద్ధత ఊసే లేదు

• లోపలి పేజీలో.. •

మాటలతో మాయ

సామాన్యులకు కోతలు... సంపన్నులకు రాయితీలు



బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నిర్మలాసీతారామన్

సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన చిట్టచివరి పూర్తి బడ్జెట్‌లోనూ నరేంద్రమోడీ ప్రభుత్వం సామాన్యులను విస్మరించింది. టక్కుటమార విద్యలను ప్రదర్శిస్తూ మాటలతో మభ్య పెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రజాకేంద్ర బడ్జెట్ అని అభివర్ణిస్తూనే సంక్షేమానికి ఎడాపెడా కోతలు పెట్టారు. దేశం మాంద్యం ముంగిట నిలిచిందని, ధరలు మరింతగా పెరిగి సామాన్యుల జీవితాలను అతలాకుతం చేసే ప్రమాదం ఉందంటూ ఆర్థికసర్వే చేసిన హెచ్చరికనూ పెడచెవిన పెట్టారు. సామాన్యులకు, కష్టజీవులకు ఆలంబనగా నిలిచిన ఉపాధి హామీ పథకం నుండి ఆహార సబ్సిడీ వరకు అన్నిటికీ నిధులు తగ్గించేశారు.

ఉపాధిహామీ పథకంలో 30 వేల కోట్ల రూపాయలు, ఆహారసబ్సిడీ పథకంలో ఏకంగా 90 వేల కోట్ల రూపాయలకు కేంద్రం కోత పెట్టింది. ఫలితంగా ఈసురోమని దేశ ప్రజలు నిట్టూర్చక తప్పని స్థితి.నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేసే చర్య ఒక్కటంటే ఒక్కటీ కూడా బడ్జెట్‌లో ప్రస్తావనకు నోచుకోలేదు. నిరుద్యోగం తీవ్రంగా ప్రబలుతున్న వేళ ఉద్యోగ, ఉపాధి కల్పన అంశాలనైనా కేంద్రం పట్టించుకుంటుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వివిధ రంగాల్లో పెట్టుబడి వ్యయాన్ని పెంచుతున్నందున ఉపాధి అవకాశాలు పెరుగుతాయంటూ సరిపెట్టే ప్రయత్నం చేసింది. అయితే, పెరిగిన ద్రవ్యోల్బణం, దిగజారిన రూపాయి విలువతో పోల్చినప్పుడు పెంచిన పెట్టుబడి వ్యయం నామమాత్రమే. దీంతో ఉద్యోగకల్పన ఓ మిధ్యగానే మిగిలిపోనుంది. రాష్ట్రాలకు చేసే కేటాయింపుల్లోనూ కోతలు పెట్టి సమాఖ్య స్ఫూర్తిపై దాడిని కొనసాగించింది. ఇక వ్యవసాయం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు అన్ని రంగాల్లోనూ కార్పొరేట్లకు వరాలు కురిపించింది. ఆదాయపు పన్ను పరిమితి పెంచడం వల్ల వేతన జీవులకు, మధ్య తరగతి వారికి కొంత ఊరట లభించింది. అయితే, సర్‌ఛార్జి తగ్గించి ఉన్నత శ్లాబుల్లోని అతి సంపన్నులకు నిర్మలమ్మ అండగా నిలిచింది. విద్య, వైద్య రంగాలకు గత బడ్జెట్‌లో జరిపిన అరకొర కేటాయింపులను కూడా ఖర్చు చేయలేదని సవరించిన బడ్జెట్ అంచనాలు తెలియచేస్తున్నాయి. విభజనతో అన్ని విధాల నష్టపోయిన రాష్ట్రానికి ఎప్పటి మాదిరే ఈ బడ్జెట్‌లోనూ మొండి చేయి చూపించారు.

- వివరాలు లోపలిపేజీల్లో

చారిత్రక బడ్జెట్



రానున్న 25 ఏళ్ల అమృత కాలానికి ప్రవేశపెట్టిన చారిత్రక బడ్జెట్ ఇది. దేశాభివృద్ధికి బలమైన పునాది. రైతులు సహా ప్రజలందరీ కలలను సాకారం చేస్తుంది. మహిళా సాధికారతకు మరింత దోహదం చేస్తుంది. మధ్యతరగతి ప్రజల కోసం అనేక చర్యలు చేపట్టాం. పన్నులు తగ్గించి ప్రజలకు ఊరటనిచ్చాం.

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

కార్పొరేట్ మిత్రుల పద్దు



ఇది మోడీ సర్కార్ కార్పొరేట్ మిత్రుల బడ్జెట్. యువతకు ఉద్యోగ కల్పనకు విజన్ లేదు. ధరల పెరుగుదలను నియంత్రించే ప్రణాళిక లేదు. ఆర్థిక అసమానతలకు కళ్లెంవేసే ఉద్దేశం లేదు. దేశంలో ఒక శాత మంది వద్ద 40 శాతం సంపద ఉంటే, 50 శాతం పేద ప్రజలు 64 శాతం వరకూ జిఎస్‌టి చెల్లిస్తున్నారు. దేశంలో 42 శాతం నిరుద్యోగులు ఉన్నా ప్రధానికి లెక్కలేదు.

- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక మందగమనం వంటి సమస్యలకు పరిష్కారం చూపడంలో బడ్జెట్ విఫలమైంది. ఆదాయపన్నులో వేతన జీవులకు కొంత ఉపశమనం లభించినా, ద్రవ్యోల్బణంతో పాటు, విద్య, వైద్యం వంటి వాటికి అధికంగా ఖర్చు చేయాల్సిరావడంతో ఆదాయ పన్ను పరిమితి పెంపు ప్రయోజనం వారికి లభించదు. రుణాలపై షరతులు విధించడం ద్వారా రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి చేసింది.

సీతారాం ఏచూరి, సిపిఎం ప్రధాన కార్యదర్శి

ఎడా పెడా కోతలు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2023-24 ఆర్థికసంవత్సరపు బడ్జెట్‌లో వివిధ కీలక రంగాలకు కోతలు పెట్టారు. కరోనా సృష్టించిన సంక్షోభం దేశ ప్రజానీకాన్ని ఇంకా వెంటాడుతూనే ఉందన్న విషయాన్ని కేంద్రం విస్మరించింది. గ్రామీణ భారతానికి ఎంతో కొంత ఆలంబనగా ఉన్న ఉపాధి హామీ పథకంలో కోత పెట్టింది. అర్థాకలితో విలవిలలాడుతున్న కోట్లాది కుటుంబాల కడుపు నింపడానికి చర్యలు చేపట్టడానికి బదులు ఆహార సబ్సిడీని భారీగా కుదించింది. వ్యవసాయం నుండి విద్య, వైద్యం అనేక రంగాలకు పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పోల్చుకున్నప్పుడు అరకొర కేటాయింపులే దక్కాయి.

ఉపాధి హామీ



గ్రామీణ పేద ప్రజలను కష్టకాలంలో ఆదుకునే మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంపై బిజెపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం దాడి కొనసాగిస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద 98,468 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 89,400 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు సవరించిన అంచనాల్లో చూపించారు. పూర్తి స్థాయి లెక్కలు వచ్చే సమయానికి ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అయినా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేవలం 60,000 కోట్ల రూపాయలనే కేంద్రం కేటాయించింది. అంటే, దాదాపుగా 30 వేల కోట్ల రూపాయల కోత!

ఆహార సబ్సిడీ




ఆహార సబ్సిడీలోనూ భారీ కోత పెట్టడం ద్వారా పేదప్రజానీకంపై మరో దాడిని కేంద్ర ప్రభుత్వం చేసింది. వివిధ పథకాల ద్వారా పేదలకు తక్కువ ధరకు సరఫరా చేసే ఆహారం కోసం ఇచ్చే సబ్సిడీలో ఏకంగా 90 వేల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం తగ్గించింది. 2021-22లో ఆహార సబ్సిడీ కోసం 2,88,969 కోట్ల రూపాయలను ఖర్చు చేయగా, 2022-23లో 2,87చ194 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు అంచనా! మాంద్యం ముంచుకొస్తున్న వేళ ఈ మొత్తాన్ని ఇంకా పెంచాల్సిఉండగా 1,97,350 కోట్ల రూపాయలతో సరిపెట్టింది. అంటే 31శాతం కోత!

ధాన్యం సేకరణ



ధాన్యం సేకరణ కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 2022-23లో 2,14,696 కోట్ల రూపాయల సబ్సిడీ ఇవ్వగా తాజా బడ్జెట్‌లో 1,37,207 కోట్లకు తగ్గించారు. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ పథకం కింద చేసే సేకరణకూ 72,283 కోట్లు గత బడ్జెట్‌లో కేటాయించగా, తాజా బడ్జెట్‌లో 59,793 కోట్లకు పరిపెట్టారు.

వ్యవసాయం



వ్యవసాయ రంగ కేటాయింపులను కూడా కేంద్రం తగ్గించింది. 2022-23 బడ్జెట్‌లో 1,51,521 కోట్ల రూపాయలను కేటాయించగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 1,44,224 కోట్ల రూపాయలనే కేటాయించింది. అంటే 5శాతం కోత పెట్టింది. మొత్తం బడ్జెట్‌లో చూస్తే గత బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 3.84 శాతం కేటాయింపులు దక్కగా, తాజా బడ్జెట్‌లో 3.20 శాతం నిధులు మాత్రమే దక్కాయి.

ఎరువులు



ఎరువులపై సబ్సిడీని గత బడ్జెట్‌తో పోలిస్తే 50 వేల కోట్ల రూపాయల మేర తాజాబడ్జెట్‌లో కేంద్రం తగ్గించింది. అంటే 22శాతం. 2022-23లో 2,25,520 కోట్ల రూపాయలను ఎరువుల సబ్సిడీ కోసం ఖర్చు చేయగా, తాజా బడ్జెట్‌లో 1,75,100 కోట్ల రూపాయలతో సరిపెట్టారు. ఫలితంగా వ్యవసాయం మరింత భారంగా మారనుంది.

గృహనిర్మాణం




పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం 2021-20లో 90,020కోట్ల రూ పాయలు ఖర్చు చేయగా, తాజా బడ్జెట్‌లో 79,590 కోట్ల రూపాయలతో సరిపెట్టారు. 2022-23లో 77,130 కోట్ల రూపాయలు ఇళ్ల నిర్మాణం కోసం వ్యయమైనట్లు అంచనా వేశారు. దానితో పోలిస్తే నామమాత్రంగా కేటాయింపులు పెంచినప్పటికీ, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఆ మొత్తం తగ్గుతుంది.


బడ్జెట్ సైజు

మాంద్యం ముంచుకొస్తున్న వేళ ప్రభుత్వ ఖర్చును గణనీయంగా పెంచాల్సిఉండగా, కార్పొరేట్ రంగ ఒత్తిళ్లకు లొంగి బడ్జెట్ సైజును గణనీయంగా తగ్గించారు. జిడిపిలో 15.33 శాతంగా గత బడ్జెట్ సైజు ఉండగా, తాజా బడ్జెట్ 14.92 శాతానికి పరిమితమైంది.

రూపాయి రాక



రూపాయి పోక




బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కొన్నింటిపై పన్నుల భారం వేయడంతోపాటు మరికొన్నింటిపై దిగుమతి సుంకాల్లో రాయితీ ఇచ్చింది. అందువల్ల వస్తువుల ధరల్లో మార్పులు రానున్నాయి.

ధరలు పెరిగేవి ..	ధరలు తగ్గేవి
బంగారం, ప్లాటినంతో తయారైన ఆభరణాలు	హీట్ కాయిల్స్
ఇమిటేషన్ జ్యూయలరీ (గిల్టు నగలు)	మొబైల్ భాగాలు ల్యాప్‌టాప్
సిగరెట్లు	డిఎస్‌ఎల్‌ఆర్‌ల కెమెరా లెన్సులు
వెండి ఉత్పత్తులు	టివి ప్యానెల్ భాగాలు
వంటగదిలో వినియోగించే ఎలక్ట్రిక్ చిమ్నీలు	లిథియం అయాన్ బ్యాటరీలు
దిగుమతైన సైకిళ్లు, ఆటవస్తువులు	దేశీయంగా ఉత్పత్తి చేసే రొయ్యల ఆహారం
విదేశాల నుండి దిగుమతయ్యే రబ్బరు	డైమండ్‌ల తయారీ వస్తువులు

రాష్ట్రానికి మళ్లీ ద్రోహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మొండి చెయ్యి చూపించింది. విభజన హామీలను పక్కన పెట్టింది. గిరిజన యూనివర్శిటీ, సెంట్రల్ యూనివర్శిటీ మినహా మరే విద్యా సంస్థకు కేటాయించలేదు. వాటికి కూడా అరకొర నిధులే కేటాయించారు. పోలవరం, విశాఖ రైల్వే జోన్, ఎన్‌ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిపుల్ ఐటి, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసేలేదు. ఇప్పటికే ఏపి ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.



ఏపికి కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీకి గతేడాది రూ.56.66 కోట్లు కేటాయిస్తే, సవరించిన అంచనాల్లో రూ.13.08 కోట్లకు తగ్గించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా గతం కంటే కేటాయింపులు తగ్గించారు. రూ.47.40 కోట్లు కేటాయించారు. ఏపి, తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాలకు రూ. 44 కోట్లు కేటాయిస్తే, సవరించిన అంచనాల్లో దాన్ని రూ. 43.75 కోట్లకు తగ్గించారు. ఇప్పుడు ఏపి, తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాలు రెండింటికి కలిపి కేవలం రూ.37.67 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో పెట్రోలియం యూనివర్శిటీకి రూ.150 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.168 కోట్లు కేటాయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ.910 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.683 కోట్లకు తగ్గించారు. విశాఖపట్నం పోర్టుకు రూ.337.69 కోట్లు కేటాయించారు.

కేంద్ర పన్నుల్లో ఏపి వాటా రూ. 41 వేల కోట్లు

కేంద్ర పన్నుల్లో ఆంధ్రప్రదేశ్‌కి రూ.41,338.02 (4.047 శాతం) కోట్లు వాటా రానుంది. అందులో కార్పొరేషన్ పన్ను రూ.13,230.89 కోట్లు, ఆదాయపు పన్ను రూ.12,871.86 కోట్లు, సంపద పన్ను రూ. -0.34 కోట్లు, సెంట్రల్ జిఎస్‌టి రూ.13,366.77 కోట్లు, కస్టమ్స్ రూ.1,311.32 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ రూ.549.22 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ.8.30 కోట్లు రాష్ట్రానికి రానున్నాయి.

తెలంగాణకూ అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకూ అన్యాయం జరిగింది. హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాతీయ సంస్థకు రూ.115 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని ఐఐటికి రూ.300 కోట్లు రుణంగా కేటాయించారు. గత బడ్జెట్‌లో సింగరేణికి రూ.2 వేల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1650 కోట్లు కేటాయించారు. కేంద్ర పన్నుల్లో తెలంగాణకి రూ.21,470.84 (2.102 శాతం) కోట్లు వాటా రానుంది.

నిరాశాజనకం



కేంద్ర బడ్జెట్‌లో ఏపికి తగినన్ని నిధులు కేటాయింపు లేదు. విభజన హామీల పరంగా నిరాశే మిగిలింది. పోలవరం ప్రస్తావనే లేకపోవడం నిరాశాజనకం. పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై నిలదీస్తాం .

- వైసిపి ఎంపి పివి మిథున్‌రెడ్డి

నిరుత్సాహం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రాజెక్టులకు ఆశించిన కేటాయింపులు లేకపోవడం నిరుత్సాహాన్ని కలిగించింది. విభజన చట్టం హామీల మేరకు నిధులు సాధించడంలో వైసిపి విఫలమైంది. అయితే సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉంది.

- టిడిపి అధినేత చంద్రబాబు

మళ్లీ అన్యాయం

కేంద్రం మళ్లీ అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదాకు మొండి చేయి చూపింది. ఎనిమిదేళ్లుగా చేస్తున్న ద్రోహాన్ని మోడీ సర్కార్ ఈ బడ్జెట్‌లోనూ కొనసాగించింది. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను పూర్తిగా విస్మరించారు. ద్రోహపూరిత బడ్జెట్‌ను ప్రజలంతా నిరసించాలి.

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ఇంగ్లండ్‌ను కుదిపేసిన అతి పెద్ద సమ్మె

వేతనాలు పెంచాలని కోరుతూ ఉపాధ్యాయులు, ట్రైన్ డ్రైవర్ల ఆందోళనలు



ఈ దశాబ్దంలోనే అతిపెద్ద వాకౌట్, సమ్మెలతో బ్రిటన్ అట్టుడుకుతోంది. విద్య, రవాణా, పౌర సేవలకు చెందిన 5 లక్షల మంది వర్కర్లు బుధవారం తమ పని ప్రదేశాల్లో వాకౌట్ చేశారు.

• లోపలి పేజీలో.. •



అదానీ గ్రూపునకు రుణ నిరాకరణ

- క్రెడిట్ సూస్సె షాకింగ్ నిర్ణయం

న్యూఢిల్లీ : అదానీ గ్రూపునకు మరో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. గౌతం అదానీ కంపెనీల బాండ్లపై మార్జిన్ రుణాల జారీని నిలిపివేస్తున్నట్లు స్విస్‌కు చెందిన ప్రయివేటు రంగ రుణదాత క్రెడిట్ సూస్సె తాజాగా ప్రకటించింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నుంచి తీవ్ర మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ కంపెనీలకు ఇది మరింత శరఘాతంగా మారింది. ఈ రెండు సంస్థల దెబ్బకు బుధవారం స్టాక్ మార్కెట్‌లో అదానీ కంపెనీల షేర్లు పేక ముక్కల్లా కూలాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబయి లిమిటెడ్ కంపెనీల బాండ్లకు సున్నా విలువను ఇస్తూ క్రెడిట్ సూస్సె నిర్ణయం తీసుకుందని.. ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వ్యక్తులు వెల్లడించినట్లు రిపోర్టులు వచ్చాయి. ఇంతక్రితం అదానీ పోర్ట్స్ బాండ్లపై 75 శాతం రుణాలు ఇచ్చేవి.

ఆదాయపు పన్ను పరిమితి రూ.7లక్షలకు పెంపు

రూ.3లక్షల వరకు పన్ను మినహాయింపు


న్యూఢిల్లీ : వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఆదాయపు పన్ను పరిమితిని పెంచడంతో పాటు పన్ను శ్లాబుల్లో మార్పులు తీసుకువచ్చింది. గతంలో రూ.5 లక్షల ఆదాయం వరకూ రిబేట్ ఇచ్చే వారు. ఇప్పుడు ఆ పరిమితిని రూ.7లక్షలకు పెంచారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో డీఫాల్ట్ ఆప్షన్‌గా ఇది వుండనుంది. కొత్త వ్యక్తిగత ఆదాయపన్ను విధానంలో ఆదాయ శ్లాబ్‌లను ప్రస్తుతమున్న ఆరు నుంచి ఐదుకు తగ్గించారు. పాత పన్ను విధానంలో మార్పులేమీ చేయలేదు. పాత విధానంలోనే మినహాయింపులు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. పాత విధానం ఎంచుకుంటే రూ.2.5 లక్షల పరిమితిని మించిన తరువాత నుంచి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

కొత్త ఆదాయ పన్ను విధానంలోని శ్లాబుల సంఖ్యను తగ్గించారు. గతంలో ఆరు శ్లాబులు ఉండగా.. వాటిని తాజాగా ఐదుకు కుదించారు.

రూ.3 లక్షల వరకు ఎటువంటి పన్ను విధించరు.

రూ.3-6 లక్షల వరకు 5శాతం పన్ను విధిస్తారు.

రూ.6-9 లక్షల వరకు 10శాతం పన్ను చెల్లించాలి.



రూ.9-12 లక్షలకు 15శాతం, రూ.12-15 లక్షల మధ్య ఆదాయం ఉంటే 20శాతం పన్ను కట్టాలి.

కొత్త విధానంలో రూ.15 లక్షల ఆదాయం దాటిన వారిపై అత్యధికంగా 30శాతం పన్ను రేటు విధిస్తారు.

కొత్త పన్ను విధానంలోకి మారాలో వద్దో ఉద్యోగులు నిర్ణయించుకోవచ్చునని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పాత విధానంలో కొనసాగాలని అనుకున్నవారు అందులోనే కొనసాగవచ్చునని చెప్పారు. కొత్త విధానంలో రూ.7 లక్షలు పైబడిన ఆదాయనికే పన్ను వర్తిస్తుంది. ఇందులో ఎలాంటి మినహాయింపులు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు.



వృద్ధి రేటు 7 శాతం!

- ద్రవ్య లోటు 5.9శాతానికి కుదిస్తాం
- ఆదాయపన్ను పరిమితి పెంపు
- వార్షిక ఆదాయం రూ.3లక్షల వరకు పన్ను లేదు
- వ్యవసాయ రంగంలో స్టార్టప్‌ల ప్రోత్సాహానికి నిధి
- నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం



న్యూఢిల్లీ: నరేంద్ర మోడీ నేతృత్వంలోని రెండవ ప్రభుత్వ చివరి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ప్రవేశపెడుతూ ప్రపంచం భారత్‌ను ఒక మెరిసే నక్షత్రంగా చూస్తోందని అన్నారు. హరితాభివృద్ధి, యువ శక్తి, సర్వతోముఖాభివృద్ధితో సహా వివిధ ప్రాధాన్యతలు ఇందులో ముడిపడి వున్నాయని అమె తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. వేతన జీవులకు ఊరట కలిగించేలా ఆదాయపుపన్ను పరిమితిని పెంచడంతో పాటు పన్ను శ్లాబులను ఆరు నుంచి అయిదుకు కుదించారు. 2047 నాటికి స్వాతంత్ర్య భారత్‌కు వందేళ్లు నిండనున్నందున అప్పటికి ఆత్మ నిర్భర్ భారత్‌ను సాధించడమే లక్ష్యమని చెప్పారు. . ప్రస్తుత సంవత్సర ఆర్థికాభివృద్ధి రేటు 7శాతంగా వుండగలదని బడ్జెట్ అంచనా వేసింది. ప్రధాన ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాలన్నింటి కన్నా ఇది ఎక్కువ అని ఆమె పేర్కొన్నారు. ద్రవ్య లోటు విషయానికి వస్తే, 2022-23 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం 6.4శాతంగా ఉంది, 2023-24 ఆర్థిక సంవత్సరంలో దీనిని జిడిపిలో 5.9శాతానికి తగ్గిస్తామన్నారు.. 2025-26 నాటికి ఈ లోటును 4.5శాతానికన్నా దిగువను ఉండేలా చూడడమే లక్ష్యమని ఆర్థిక మంత్రి సెలవిచ్చారు. ద్రవ్యలోటు తగ్గించే పేరుతో సామాజిక రంగాలకు కేటాయింపుల్లో పలు కోతలు ప్రకటించారు. రైల్వేలకు గత ఏడాది 1.40 లక్షల కోట్లు కేటాయించగా, ఈ సారి 2.40 లక్షల కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

ముఖ్యాంశాలు :

- ఆదాయపుపన్ను పరిమితిని ప్రస్తుతమున్న రూ.5లక్షల నుండి రూ.7లక్షలకు పెంచారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో డీఫాల్ట్ ఆప్షన్‌గా ఇది వుండనుంది.
- కొత్త వ్యక్తిగత ఆదాయపుపన్ను విధానంలో ఆదాయ శ్లాబ్‌లను ప్రస్తుతమున్న ఆరు నుండి 5కి తగ్గించారు. రూ.3లక్షలకు ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని పెంచారు.
- కొత్తగా వర్తించే పన్ను రేట్ల ప్రకారం రూ.3లక్షల వరకు ఎలాంటి పన్ను వుండదు
- రూ.3 నుండి రూ6లక్షల వరకు 5శాతం పన్ను విధిస్తారు, రూ.6 నుండి రూ.9లక్షల వరకు 10శాతం పన్ను వుంటుంది, రూ.9నుండి రూ.12 లక్షల వరకు 15శాతం, రూ.12 నుండి రూ.15లక్షలవరకు 20శాతం, రూ.15లక్షలు దాటితే ఏకంగా 30శాతం పన్ను విధిస్తారు.
- మరోవైపు రైల్వేలకు గతంలో ఎన్నడూ లేని రీతిలో భారీగా కేటాయింపులు జరిగాయి. గతేడాది రూ.1.40లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి దాన్ని రూ.2.40లక్షల కోట్లకు పెంచారు. 2013-14తో పోలిస్తే బడ్జెట్ కేటాయింపులు ఏకంగా 9రెట్లు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు.
- అలాగే ద్రవ్య సంఘటిత చర్యలను కొనసాగించడం ద్వారా 2025-26 నాటికి ద్రవ్య లోటును 4.5శాతానికి తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. గత బడ్జెట్‌లో కూడా ఇదే లక్ష్యాన్ని తాను ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేస్తూ ఈ ఏడాది కూడా ఆ పంథాకే కట్టుబడి వున్నామన్నారు.
- ద్రవ్య లోటును తగ్గించేందుకై తీసుకునే నికర రుణాలు రూ.11.8లక్షల కోట్లు వుంటాయని అంచనా వేశారు. ఇక మిగిలిన నిధులను చిన్న పొదుపు మొత్తాల నుండి, ఇతర వనరుల నుండి తీసుకోవాలని భావిస్తున్నామని మంత్రి తెలిపారు.
- మూలధన పెట్టుబడుల కేటాయింపులు వరుసగా మూడో ఏడాది 33శాతం పెరిగి 10లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది జిడిపిలో 3.3శాతంగా వుంది.

వృద్ధి అవకాశాలను, ఉపాధి కల్పనను పెంపొందించేందుకు, ప్రైవేటు పెట్టుబడులను సేకరించేందుకు, అంతర్జాతీయంగా వీస్తున్న పెనుగాలులకు వ్యతిరేకంగా ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టిని అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పెరిగిన ఈ పెంపుదలలు చాలా కీలకమని అన్నారు.

- వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని రూ.20లక్షల కోట్లకు పెంచారు. పశు సంరక్షణ, మత్స్య విభాగంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు.
- గ్రామీణ ప్రాంతాల్లో యువ పారిశ్రామికవేత్తలు వ్యవసాయ రంగ స్టార్టప్‌లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించేందుకు అగ్రికల్చర్ యాక్సిలేటర్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ళకు వినూత్నమైన, సమర్ధవంతమైన పరిష్కార మార్గాలు చూపించడం ఈ ఫండ్ యొక్క ప్రధాన లక్ష్యంగా వుంటుందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు తీసుకురావడానికి, ఉత్పాదకతను, లాభాలను పెంచడానికి ఆధునిక సాంకేతికతలను తీసుకురావడం కూడా ఈ ఫండ్ లక్ష్యంగా వుంటుందన్నారు.

పిఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్

మూడేళ్ళలో లక్షలాదిమంది యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం పిఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పేరుతో ఒక పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల కళాకారులు తయారుచేసే ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరిచేందుకు, వారి ఉత్పత్తులు అందరికీ చేరువయ్యేలా చేసేందుకు అవసరమైన సాయాన్ని అందిచేందుకు పిఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ (పిఎం వికాస్) పేరుతో దేశంలోనే తొలి ప్యాకేజీ సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఆర్థికంగా తోడ్పాటును అందించకపోయినా అధునాతనమైన నైపుణ్యాల శిక్షణ, ఆధునిక డిజిటల్ సాంకేతికతలు, సమర్ధవంతమైన హరిత సాంకేతికతలు, డిజిటల్ చెల్లింపులు, సామాజికభద్రత వంటి వాటికి ఈ పథకం అవకాశం కల్పిస్తుంది.

- కరోనా సమయంలో చిన్న, మధ్య తరహా సంస్థలు కాంట్రాక్టులను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైనట్లైతే, బిడ్‌కు లేదా సెక్యూరిటీకి సంబంధించి డిపాజిట్ చేసిన మొత్తంలో 95శాతాన్ని ప్రభుత్వం లేదా దాని సంస్థలు వెనక్కి తిరిగి ఇచ్చేస్తాయి.

పరపతి హామీ : కార్పస్‌లోకి రూ.9వేల కోట్లను చొప్పించడం ద్వారా ఎంఎస్‌ఎంఇలకు పరపతి హామీ పథకాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తుంది. రూ.2లక్షల కోట్ల అదనపు కొలేటరల్ రహిత హామీ రుణాలకు ఇది అదనంగా వుంటుందని మంత్రి తెలిపారు.

హరిత ఇంధనం : ఇంధన పరివర్తనను సాధించే దిశగా మూలధన పెట్టుబడుల కోసం బడ్జెట్‌లో రూ.35వేల కోట్లు కేటాయించారు.

- మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని తీసుకువచ్చారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ పథకం కింద ప్రస్తుత గరిష్ట పరిమితిని రూ.15లక్షల నుండి రూ.30లక్షలకు పెంచారు.

ఇది ప్రజా వ్యతిరేక, కోతల బడ్జెట్!

- ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది
- సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శ

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌కు సమర్పించిన కేంద్ర బడ్జెట్ కోతల బడ్జెట్, , పూర్తిగా ప్రజా వ్యతిరేకమైనది అని సిపిఎం విమర్శించింది. పార్టీ పొలిట్ బ్యూరో ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఒక ప్రకటన విడుదల జేసింది. కరోనా మహమ్మారి తలెత్తడానికి ముందే భారతదేశ ఆర్థిక వ్యవస్థ మందగించింది, ఆ తర్వాత వరుసగా కరోనా వచ్చిన రెండేళ్లలోనూ మరింత అధ్వాన స్థితికి దిగజారింది, కరోనా తర్వాత అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా కదులుతున్నప్పుడు ఆ మహమ్మారి అనంతర పునరుద్ధరణపై ప్రతికూల ప్రభావం పడింది. ఇటువంటి పరిస్థితుల్లో 2023-24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ఉపాధి కల్పన, దేశీయ డిమాండ్‌ను, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం వంటి కీలకమైన అంశాలను ప్రస్తావించి ఉండాల్సింది.

ఈ పరిస్థితులను ఎదుర్కొనడంలో ఈ బడ్జెట్ విఫలమైంది. పైగా దీనికి విరుద్ధంగా సంపన్నులకు మరింతగా పన్ను రాయితీలను ఇస్తూ, ద్రవ్యలోటు తగ్గించే పేరుతో ప్రభుత్వ వ్యయాన్ని కుదించింది. దేశంలో గత రెండేళ్లలో ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 40.5శాతం దాకా కేవలం ఒకే ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల వద్ద పోగు పడిందని ఆక్స్‌ఫామ్ నివేదిక బయటపెట్టిన సమయంలో ఈ బడ్జెట్ వచ్చింది. అందువల్ల, ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసే బడ్జెట్ అని చెప్పాలి.

2022-23 సంవత్సరానికి సవరించిన అంచనాల కన్నా 2023-24 సంవత్సరానికి మొత్తం ప్రభుత్వ వ్యయం కేవలం 7శాతమే అధికం.. అదే సమయంలో నామమాత్రపు (ద్రవ్యోల్బణంతో కూడిన) జిడిపిలో పెరుగుదల 10.5శాతంగా వుంటుందని అంచనా వేయబడింది. అందువల్ల, జిడిపి శాతంలో ప్రభుత్వ వ్యయం తగ్గుతుంది. వడ్డీ చెల్లింపులను కూడా మినహాయించినట్లైతే, అప్పుడు ఈ వ్యయం గతేడాది కన్నా కేవలం 5.4శాతమే ఎక్కువ. ఒక్కసారి అవ్యక్త ద్రవ్యోల్బణ రేటు 4శాతాన్ని, దాదాపు ఒక శాతంగా ఉన్న జనాభా పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే, ప్రజా ప్రయోజనాలే కీలకమని చెప్పుకుంటున్న ఈ బడ్జెట్‌తో కేవలం మన జనాభాలో మెజారిటీ ప్రజల జీవనోపాధిపై దాడులు మరింతగా పెరగబోతున్నాయి.. ఇదివరకెన్నడూ లేని రీతిలో, నిరుద్యోగం నింగినంటుతున్న ఈ సమయంలో, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు 33శాతం తగ్గించారు.. ఆహార సబ్సిడీలో రూ.90వేల కోట్లు, ఎరువుల సబ్సిడీలో రూ.50వేల కోట్లు, పెట్రోలియం సబ్సిడీలో రూ.6,900కోట్లు కోతపెట్టారు.

కరోనా మహమ్మారి ఇంతలా కల్లోలం, సృష్టిస్తే, గతేడాది ఆరోగ్య రంగ కేటాయింపుల్లో రూ.9225 కోట్లు, విద్యా రంగ బడ్జెట్‌లో రూ.4297కోట్లు ఖర్చు చేయకుండా మురగబెట్టారు.

చాలీచాలని వేతనాలతో నానా అవస్థలు పడుతున్న ఐసిడిఎస్ స్కీమ్ కార్మికులకు ఎలాంటి పెంపుదల లేదు. మొత్తం వ్యయంలో మహిళలకు బడ్జెట్‌లో (జెండర్ బడ్జెట్) కేవలం 9శాతం మాత్రమే కేటాయించారు. జనాభాలో 16శాతం మంది ఎస్‌సిలు వుండగా, వారికి బడ్జెట్‌లో కేవలం 3.5శాతం,. 8.6శాతంగా ఉన్న ఎస్టీలకు కేవలం 2.7శాతం మాత్రమే కేటాయించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ ఒకపక్క ప్రభుత్వం అర్భాటంగా చేసుకున్న ప్రచారంలోని డొల్లతనం ప్రధాని కిసాన్ నిధికి కేటాయింపులను రూ.68వేల కోట్లు నుండి రూ.60వేల కోట్లకు తగ్గించడంలో కనబడుతోంది.

మూలధన వ్యయాల్లో గణనీయమైన పెరుగుదల వుందని, ఇది ఉపాధి కల్పనకు దారి తీస్తుందని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు చూసేందుకు పైకి మెరుగ్గా కనిపిస్తున్నా లోపలంతా బూటకమేనని పొలిట్‌బ్యూరో విమర్శించింది. మూలధన వ్యయాన్ని గణనీయంగా పెంచామని 2022-23 సంవత్సరానికి సవరించిన అంచనాలను చూసినట్లైతే ప్రభుత్వ సంస్థల వనరులతో సహా మొత్తంగా మూలధన వ్యయాలు కేవలం 9.6శాతమే పెరిగాయి. ఇది, నామమాత్రపు జిడిపిలో 15.4శాతం పెరుగుదల కన్నా బాగా తక్కువే.

ఆదాయపుపన్ను మినహాయింపు పరిమితిని రూ.5లక్షల నుండి రూ.7లక్షలకు పెంచడం వల్ల వేతన జీవులకు కొద్దిగా ఉపశమనం కలిగింది. అయితే, ద్రవ్యోల్బణం, సామాజిక రంగ వ్యయంలో కోతల వల్ల విద్య, వైద్య రంగాలతో సహా నిత్యావసర సేవలపై ప్రజలు మరింతగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వాలకు వనరుల బదిలీలను కుదించడం ద్వారా ఈ బడ్జెట్, ఆర్థిక సమాఖ్యవాదంపై మరిన్ని దాడులను కొనసాగిస్తోంది. ఈ బదిలీలు, 2022-23లో 8.4శాతం ద్రవ్యోల్బణం రేటు వున్నప్పటికీ 2021-22లో జరిగిన బదిలీలు ఒకేలా వున్నాయని 2022-23 సంవత్సరానికి సవరించిన అంచనాలు వెల్లడిస్తున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలను తీసుకునే అంశంపైనా మరిన్ని షరతులు రుద్దింది.

బడ్జెట్‌లో సంపన్నులకు ఇచ్చే పన్ను రాయితీలు, మొత్తంగా పన్ను ప్రతిపాదనలన్నిటితో 2023-24లో రూ.35వేల కోట్ల మేర రెవిన్యూ నష్టం ఉంటుందని ఆర్థిక మంత్రి తెలియచేశారు.

ప్రజలకు ఎంతగానో అవసరమైన ఉపశమనాన్ని కలిగించేందుకు, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దారి తీసేలా దేశీయ డిమాండ్‌ను పెంపొందించేందుకు గానూ బడ్జెట్ ఈ క్రింది చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఉపాధి కల్పనా ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలి.
- మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను గణనీయంగా పెంచి, కార్మికులకు అధిక వేతనాలు ఇవ్వాలి.
- 5కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటూ 5కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలి.
- సంపద, వారసత్వపు పన్నులను విధించాలి.
- ఆహార పదార్ధాలు, మందులతో సహా నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలి.

ఈ బడ్జెట్‌లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలకు, కోతలకు వ్యతిరేకంగా, పైన పేర్కొన్న డిమాండ్ల అమలును కోరుతూ ఈ నెల 22 నుండి 28వరకు దేశవ్యాప్తంగా సిపిఎం నిరసన కార్యక్రమాలునిర్వహిస్తుంది. పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది. ప్రజల జీవనోపాధిని పరిరక్షించాలని కోరుకునే అన్ని తరగతుల ప్రజలూ ఈ నిరసనల్లో పాల్గొని, గొంతెత్తాలని పార్టీ పొలిట్‌బ్యూరో కోరింది.

సాగుకు కోతలు

- కార్పొరేట్లకు ఊతం
- సహకారంపై కేంద్రం పట్టు బిగింపు
- ఎంఎస్‌పి చట్టబద్ధత ఊసే లేదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

డెబ్బయి శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది. సాగు పద్దులో అన్నింటికీ కోతలు పెట్టింది. సంక్షోభం, ఆపై మాంద్యం ప్రభావంతో సేద్యపురంగం కుదేలవగా, కోవిడ్ విలయం తోడు కావడంతో రైతుల, వ్యవ సాయ కార్మికుల, గ్రామీణ ప్రజల జీవనోపాధి దెబ్బతింది. కార్పొరేట్లకు ఎన్ని ఉద్దీపన పథకాలిచ్చినా పారిశ్రామిక వృద్ధి పెరగలేదు. కానీ కోవిడ్ క్లిష్ట సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకున్నది ఒక్క వ్యవసాయమే. మోడీ ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా ఆ రంగానికి 2023-24 బడ్జెట్‌లో కత్తెర పెట్టింది. మరోవైపు వ్యవసాయరంగ కార్పొరేటీకరణకు నడుంకట్టింది. విరివిగా ప్రకృతి సేద్యం, డ్రోన్ల వాడకం, స్టార్టప్‌లకు ప్రత్యేక నిధి, సహకారరంగంపై కేంద్ర పట్టు బిగింపునకు మరిన్ని చర్యలు చేపడతామని ప్రకటించింది. ప్రత్యామ్నాయ ఎరువుల ప్రోత్సాహానికి 'పిఎం-ప్రణామ్' అనే పథకాన్ని ప్రతిపాదించింది. డెయిరీ, ఫిషరీస్ సహా వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ.20 లక్షల కోట్లుగా సర్కారు పేర్కొంది. కాగా బ్యాంక్ రుణాలు వాస్తవ సాగుదారులకు అందట్లేదు.

28 వేల కోట్లు కట్

గత బడ్జెట్‌కు ఇప్పటికి వ్యవసాయానికి రూ.28 వేల కోట్లకుపైన కోత పడింది. 2022-23లో 1,51,521 కోట్లు ప్రతిపాదించారు. అప్పటి మొత్తం బడ్జెట్‌లో 3.84 శాతం. 2023-24లో 1,44,214 కోట్లు అన్నారు. మొత్తం బడ్జెట్‌లో 3.20 శాతం మాత్రమే. మునుపటి కంటే 0.64 శాతం తగ్గింది. తగ్గుదల సుమారు 28 వేల కోట్లు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేసేందుకంటూ అమలు చేస్తున్న పిఎం కిసాన్, విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే క్రాప్ ఇన్సూరెన్స్, రైతులకు కనీస మద్దతు ధర, పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ఉపకరించే ఫుడ్ సబ్సిడీ, తిండిగింజల సేకరణ పద్దుకూ కోతలే పెట్టారు. ఎరువుల సబ్సిడీకీ కత్తెరలే. ఎంఎస్‌పి గ్యారంటీకి చట్టబద్ధత కోసం రైతులు ఉద్యమిస్తుండగా బడ్జెట్‌లో ఆ అంశం మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీకి నిధులు భారీగా తగ్గించారు. ఆర్‌కెవివై, క్రిషియోన్నతి స్కీంలదీ అదే పరిస్థితి.



ముఖ్య ప్రతిపాదనలు (రూ.కోట్లు)

వివరం	2022-23 అంచనా	2022-23 సవరించిన బడ్జెట్	2023-24 అంచనా
పిఎం కిసాన్	68,000	60,000	60,000
పంటల బీమా	15,500	12,376	13,625
ఎరువుల సబ్సిడీ	1,05,222	2,25,220	1,75,100
ఫుడ్ సబ్సిడీ	2,06,831	2,87,194	1,97,350
ఉపాధి హామీ	73,000	89,400	60,000

కార్పొరేట్- మతోన్మాదం

వ్యవసాయంలో కార్పొరేట్ల జోక్యం, ప్రైవేటు ఆధిపత్యం పెంచే పలు కార్యక్రమాలను బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. రానున్న రోజుల్లో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం కిందికి తీసుకొచ్చి రసాయన ఎరువుల వాడకం తగ్గించడం ద్వారా రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తారు. తద్వారా రైతుల ఆదాయాలను సుస్థిరం చేస్తారు. ప్రత్యామ్నాయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు పిఎం-ప్రణామ్ పథకాన్ని ప్రకటించారు. పైకి సేంద్రీయం అంటున్నా గోవు విసర్జితాలకు అధిక ప్రాధాన్యమిచ్చి మతోన్మాదాన్ని రైతులకు ఎక్కిస్తారు. వ్యవసాయంలో డ్రోన్లను ప్రవేశపెడతారు. కిసాన్ డ్రోన్లను పంటలపై అంచనాలు, భూరికార్డుల డిజిటలైజేషన్, ఎరువులు, పురుగుమందుల పిచికారీ వంటికి ఉపయోగిస్తారు. సహకారరంగంపై కేంద్ర పెత్తనాన్ని పెంచేందుకు దేశంలోని 63 వేల పిఎసిఎస్‌ల కార్యకలాపాల డిజిటలైజేషన్ కోసం రూ.2,516 కోట్లు ఖర్చు చేస్తారు. భవిష్యత్తులో పిఎసిఎస్‌లను మల్టీపర్పస్ ప్రయోజన కేంద్రాలుగా మారుస్తారు. డెయిరీ, మత్స్య సహకార సొసైటీలను నెలకొల్పుతారు.

గ్రామాల్లో స్టార్టప్‌లకు నాబార్డు ద్వారా ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. పత్తి పంట దిగుబడి, నాణ్యత పెంచేందుకు క్లస్టర్ తరహాలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ప్రవేశపెడతారు. నూనెల దిగుమ తులు తగ్గించేందుకు నూనెగింజల సాగును, ఆరోగ్యం కోసం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తారు.

శాఖల వారీ కేటాయింపులు (రూ. లక్షల కోట్లలో)

రక్షణ శాఖ	5.94
రోడ్డు రవాణా, హైవేలు	2.70
రైల్వే	2.41
ఆహారం-పౌరసరఫరా	2.06
హోం అఫైర్స్	1.96
ఎరువులు, రసాయనాలు	1.78
గ్రామీణాభివృద్ధి	1.60
వ్యవసాయం	1.25
కమ్యూనికేషన్స్	1.23

కొన్ని ప్రధాన పథకాలకు (రూ. కోట్లలో)

ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీ	1,250
జల్ జీవన్	70,000
ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లు	5,943
పిఎంఎవై	79,590
ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధి	5,172

'పాన్' తప్పనిసరి

ప్రస్తుతం వ్యాపారాలకు వివిధ రకాల అనుమతులు ఇచ్చేందుకు 13కు పైగా వివిధ రకాల కార్డులను ఐడీలుగా అడుగుతున్నారు. ఇక నుంచి పాన్ ఒక్కదానినే అంగీకరిస్తారు. దేశ వ్యాప్తంగా వివిధ అనుమతులు, క్లియరెన్స్‌ల కోసం జాతీయ స్థాయిలో సింగిల్ విండో వ్యవస్థను తెచ్చారు.

వికలాంగుల హక్కుల చట్టం అమలు నిధుల్లో రూ.90 కోట్ల కోత

- నిరసనలకు ఎన్‌పిఆర్‌డి పిలుపు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో వికలాంగులకు నిరాశే ఎదురైంది. 'దివ్యాంగజన్' అనే పేరు పెట్టడం మినహా.. వికలాంగులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిగా విస్మరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో వికలాంగులకు కేటాయింపులు ఒక శాతం మాత్రమే పెరిగింది. 2022-23 బడ్జెట్‌లో వికలాంగులకు కేటాయించిన నిధుల్లో రూ.196 కోట్లు వినియోగించలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో గత ఏడాది కంటే ఒక శాతం అదనంగా వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించారు. వికలాంగ హక్కుల చట్టం అమలు కోసం గత ఏడాది రూ.240.39 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.150 కోట్లకు దిగజారింది. ఈ ఏడాది రూ.90 కోట్లు కోత పెట్టడంతో ఈ చట్టాన్ని ఏవిధంగా అమలు చేస్తారనే ఆందోళన వికలాంగుల్లో నెలకొంది. కరోనా మహమ్మారి ప్రభావం ఇంకా కొనసాగుతున్న వేళ వికలాంగులందరికీ ఉచిత, సార్వత్రిక ఆరోగ్య సదుపాయాలు కల్పించాలన్న డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జాతీయ వికలాంగుల పెన్షన్‌కు రూ.290 కోట్లే కేటాయించారు. గత పదేళ్లుగా నెలకు రూ.300గా ఇస్తున్న పింఛను పెంచాలన్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్న వేళ.. ఉపాధి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రైవేటు రంగంలో వికలాంగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

నిరసనలకు ఎన్‌పిఆర్‌డి పిలుపు

వికలాంగులను విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. తిరోగమన బడ్జెట్‌కు వ్యతిరేకంగా గొంతు వినిపించాలని తన అనుబంధ సంస్థలకు, ఇతర వికలాంగ హక్కుల సంస్థలను కోరింది.

ఎన్నికల వేళ కర్ణాటకకు ప్రాధాన్యం

త్వరలో ఎన్నికలు జరగనున్న దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటకకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. కర్ణాటకలో కరువు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఆర్థిక సహకారం అందించనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. 29.4 టీఎంసీల సామర్ధ్యంతో 2.25 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు అప్పర్‌భద్ర ప్రాజెక్టును కర్ణాటక చేపట్టింది. ఈ ఏడాది మే 24తో కర్ణాటక అసెంబ్లీ గడువు ముగియనుంది. ఆలోపే అంటే మార్చి-ఏప్రిల్‌లో అక్కడ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

ఉపాధి హామీకి తూట్లు

- రూ.29,400 కోట్లు తగ్గుదల
- వ్యవసాయ, అనుబంధ రంగాలకూ పదేళ్లలో భారీగా కోత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీకి తూట్లు పొడుస్తోంది. 2021-22 బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.98,467.85 కోట్లు కేటాయించారు. 2022-23లో రూ.89,400 కోట్లు కేటాయించారు. అంటే ఏడాదిలో రూ.9,067.85 కోట్లు తగ్గించారు. ఈ ఏడాది (2023-24) బడ్జెట్‌లో రూ.60,000 కోట్లకు కుదించారు. ఏడాదిలో రూ.29,400 కోట్ల కేటాయింపు తగ్గింది. పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా ఉండగా, ఉన్న చట్టానికి సైతం తూట్లు పొడుస్తున్న పరిస్థితికి తాజా కేటాయింపులు అద్దం పడుతున్నాయి.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు భారీ కోత

2022-23లో వ్యవసాయ, అనుబంధ రంగాల కేటాయింపు మొత్తం బడ్జెట్లో 3.84 శాతం ఉండగా, ప్రస్తుత బడ్జెట్ (2023-24)లో అది 3.20 శాతానికి పడిపోయింది. గత పదేళ్లలో ఇదే అతి పెద్ద కోత. గతేడాది కేటాయింపు రూ.1,51,521 కోట్లు ఉండగా, 2023-24 లో అది రూ.1,44,214 కోట్లకు పడిపోయింది. దాదాపు రూ.7,307 కోట్ల కేటాయింపు తగ్గింది. పంటల బీమా పథకం (పిఎంఎఫ్‌బివై) కేటాయింపు 12 శాతం తగ్గింది. గతేడాది రూ.15,500 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.13,625 కోట్లు కేటాయించారు. పిఎం కిసాన్ పథకానికి కేటాయింపు 13 శాతం తగ్గింది. గత బడ్జెట్‌లో రూ.68 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.60 వేల కోట్లు కేటాయించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) నిధులు ఏకంగా 31 శాతం తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ.10,433 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.7,150 కోట్లు కేటాయించారు. ఈ పథకం క్రింద రాష్ట్రాలకు తమ ప్రణాళిక ప్రకారం ఖర్చు చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తుంది. ఇప్పుడు రాష్ట్రాలకు వికేంద్రీకృతమైన కార్యక్రమాలకు కేంద్రం పెద్ద కోత విధించింది. పిఎం-ఆశా పథకానికి కేటాయింపు రూ.1 కోటి నుంచి తగ్గిస్తూ ఈసారి రూ.లక్ష మాత్రమే కేటాయించింది. పిఎస్‌ఎస్-ఎంఐఎస్ పథకానికి గతేడాది రూ.1,500 కోట్లు కేటాయించగా, ఈసారి దానిని రూ.1 కోటికి తగ్గించింది.



ఎరువుల సబ్సిడీలో రూ.50 వేల కోట్ల కోత

గతేడాదిలో ఎరువుల సబ్సిడీకి రూ.2,25,000 కోట్ల కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1,75,000 కోట్లకు తగ్గించారు. యూరియాకు కేటాయింపులు కూడా రూ.1,18,457.24 కోట్ల నుంచి రూ..1,04,063.18 కోట్లకు తగ్గించారు. మొత్తం బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి కేటాయింపులు కూడా తగ్గాయి. 2022-23లో 5.81 శాతం కేటాయింపులు ఉండగా, ప్రస్తుత (2023-24) 5.29 శాతానికి తగ్గాయి.

పేదల వంట గ్యాస్ కనెక్షన్లకు కోత



పేదలకు వంట గ్యాస్ (ఎల్ పిజి) కనెక్షన్లకు బడ్జెట్‌లో భారీగా కోత విధించారు. 2022-23లో రూ.8,010 కోట్లు కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం లక్ష రూపాయలే కేటాయించారు. వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము జమ చేసే ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. 2022-23లో రూ.4,000 కోట్లు కేటాయిస్తే, 2023-24లో కేవలం రూ.180 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాల కేటాయింపుల్లోనూ తగ్గింపు

ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ కోసం కేంద్రం ప్రాయోజిత పథకాల కేటాయింపులు తగ్గాయి. గత బడ్జెట్‌లో రూ.1,819.52 కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.976.86 కోట్లకు తగ్గించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు ఈసారి నిధులు కేటాయించలేదు. మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించిన పోషకాహారం, భద్రత, సంక్షేమానికి కేటాయింపులు భారీగా తగ్గించారు. 2022-23లో రూ.3,512.88 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1,514 .32 కోట్లకు తగ్గించారు. యువజన, క్రీడల రంగంలోనూ కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపులో కోత విధించారు. స్పేస్ రంగంలో న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయింపులు భారీగా తగ్గించారు.

సప్తరుషులు.. ఏడు రంగాలు... :

సమగ్ర అభివృద్ధి, చివరి మైలుకు చేరుకోవడం, మౌలిక సదుపాయాలు- పెట్టుబడులు, సంభావ్యతను ఆవిష్కరించడం, గ్రీన్ గ్రోత్, యువశక్తి, ఆర్థిక రంగంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశాభివృద్ధిలో ఈ ఏడు రంగాలు ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయని, సప్తరుషులు మాదిరిగా పనిచేస్తాయని చెప్పారు.

మహిళలు, వృద్ధుల కోసం...

న్యూఢిల్లీ : మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని బడ్జెట్‌లో కేంద్రం ప్రవేశపెట్టింది. రెండేళ్ల ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో 7.5 శాతం స్థిర వడ్డీ ఉంటుంది. గరిష్ఠంగా రూ.2 లక్షలు డిపాజిట్ చేయొచ్చు.

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ కింద ప్రస్తుతం రూ.15 లక్షలుగా ఉన్న గరిష్ఠ పరిమితిని రూ.30 లక్షలకు పెంచారు. మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ పరిమితిని 4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. జాయింట్ అకౌంట్ కలిగిన వారికి రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు. 7.10% వడ్డీ లభిస్తుంది.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు మాట బడ్జెట్‌లో లేదని వక్తలు తెలిపారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చే ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద బడ్జెట్ ప్రతులను చింపి నిరసన తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశ సంపద, సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టేందుకు మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసిందని విమర్శించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవసాయాన్ని పెంచేందుకు ఎరువుల సబ్సిడీపై 25 శాతం కోత విధించారన్నారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలూ ప్రకటించకపోవడం దుర్మార్గమని తెలిపారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రకటించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇప్పటికీ ప్రహరీ దాటలేదన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన



డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

నిరసన కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.హరిబాబు మాట్లాడుతూ కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఉపాధి హామీకి గత సంవత్సరం కంటే రూ.25 వేల కోట్లు తక్కువ కేటాయించడం అన్యాయమన్నారు. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాలకు 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్ జాతులకు 2.7 శాతం మాత్రమే కేటాయించారని, సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ ధర్నాల్లో సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు నాయకులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కును విస్మరించడాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. విజయనగరం జిల్లా రాజాంలో సిటిఐయు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని వక్తలు విమర్శించారు.

బడ్జెట్ బాగుంది

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంశాలు రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉన్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌పై బుధవారం ఆయన స్పందిస్తూ.. కొన్ని రంగాల్లో నిధులు తగ్గినట్లు చెప్పారు. ద్రవ్యలోటును తగ్గించడం మంచిదని, పెట్టుబడి వ్యయం రూ.2.5 లక్షల కోట్లు పెరిగిందని పేర్కొన్నారు. పన్నుల ఆదాయం, రూ.3 లక్షల కోట్లకుపైగా పెరిగిందని, అందులో రాష్ట్రాల వాటా కూడా గణనీయంగా పెరిగిందన్నారు. అయితే ఎరువులు, పౌర సరఫరాల్లో ఆహార సరుకుల విషయంలో నిధులను తగ్గించారని పేర్కొన్నారు. పెట్రో ఆదాయం కూడా ఏడు వేల కోట్ల వరకు తగ్గినట్లు చెప్పారు.

రొయ్యల ఉత్పత్తిలో మేతపై ఇంపోర్ట్ డ్యూటీని తగ్గించాలని కూడా నిర్ణయించడం సంతోషకరమన్నారు. ఆర్‌ఐడిఎఫ్ మాదిరిగానే పట్టణ ప్రాంతాల్లో పథకాల కోసం బిఐడిఎఫ్ తీసుకురానున్నారని, నర్సింగ్ కాలేజీల వల్ల, స్కిల్ హబ్‌ల ద్వారా రాష్ట్రానికి మేలు కలుగుతుందన్నారు.

రాష్ట్రానికి నిరాశే

- 31 మంది ఎంపిలు ఉండి వైసిపి ఏమీ సాధించలేదు
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రాజెక్టులకు ఆశించిన కేటాయింపులు లేకపోవడం నిరుత్సాహాన్ని కలిగించిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కర్ణాటకలోని కరువు ప్రాంతాల కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించారని, విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో వెనుకబడ్డ ఏడు జిల్లాలకు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వీటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులు, విభజన హామీల అమలు, రాజధాని నిర్మాణానికి నిధులు సాధించడంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీల అమలుకు ఇదే చివరి బడ్జెట్ అని, ఇందులో కూడా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో విఫలమైందని అన్నారు. సొంత కేసులు, స్వప్రయోజనాలకు మాత్రమే వైసిపి ఎంపిలు కట్టుబడి ఉన్నారని మరోసారి రుజువైందని విమర్శించారు. 31 మంది ఎంపిలు ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు.

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయానికి రూ.13.7 లక్షల కోట్లు కేటాయించడం సానుకూలమని తెలిపారు. 2047 లక్ష్యంగా పథకాలు, కార్యక్రమాల రూపకల్పన దిశగా ఆలోచనలు చేయడాన్ని స్వాగతించారు. విజన్-2047 ద్వారా ప్రపంచ అగ్రగామిగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి సాంకేతికతను అందించే ప్రణాళికలు.. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ఉందన్నారు. ఆదాయపు పన్ను శ్లాబ్‌లలో మార్పులు తెచ్చి వేతన జీవులకు ఊరట కల్పించారని హర్షం వ్యక్తం చేశారు.

కేంద్రం చిన్నచూపు : పిసిసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తోందని, ఇందుకు బుధవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్పష్టమైందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్ ఓ దగాకోరు బడ్జెట్‌గా ఆయన అభివర్ణించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయింపు విషయం బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని, అమరావతి నిర్మాణ విషయంలో కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదన్నారు.

మధ్య తరగతి బడ్జెట్

- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతికి ఆర్థికపరంగా ఊరట కలిగిస్తుందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను విషయంలో ఇచ్చిన రాయితీలు, శ్లాబుల మార్పులు ఉద్యోగ వర్గాలకు సంతోషాన్ని కలిగిస్తాయన్నారు. మహిళలు, వృద్ధులు పొదుపు పథకాలకు ఇచ్చిన రాయితీలు ఆయా వర్గాల్లో పొదుపు ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని 11 శాతం పెంచడం రైతాంగానికి ఉపయుక్తంగా ఉండటంతోపాటు చిరుధాన్యాలకు ప్రాధాన్యం పెరిగేలా ప్రత్యేక పథకం తీసుకురావడం మంచి పరిణామమన్నారు.

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని బడ్జెట్

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ సంక్షోభానికి ఏ మాత్రం పరిష్కారం చూపేలా కేంద్ర బడ్జెట్ లేదని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్‌లో గతేడాది కంటే నిధులను బాగా తగ్గించిందని వారు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న అంశాన్ని విస్మరించారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రుణమాఫీ చేసే కేంద్ర ప్రభుత్వం.. దేశానికి అన్నంపెట్టే రైతులకు రుణమాఫీ చేసేందుకు ముందుకు రాకపోవడం తగదన్నారు. దేశంలోని 8.5 లక్షల సహకార సొసైటీలను రాష్ట్రాల పరిధి నుంచి తమ గుప్పెట్లోకి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని తెలిపారు. ఈ చర్యలను రైతాంగం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రానికి మరోసారి మొండిచేయి

- కొనసాగుతున్న బిజెపి విద్రోహం
- బడ్జెట్‌ను నిరసించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం ఎప్పటి మాదిరిగానే 2023-24 బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజల హక్కయిన 'ప్రత్యేక హోదా'కు మొండిచెయ్యి చూపిందని, విభజన హామీలను పూర్తిగా అటకెక్కించిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాధ్యతను మోసలి కన్నీరుకార్చిన ప్రధాని ఎనిమిదేళ్లుగా ద్రోహం చేస్తూనే వచ్చారని, రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టుపెట్టిందని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తలేదని, ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కును బలపర్చుకోడానికి ఎలాంటి ప్రతిపాదనా లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులూ కేటాయించలేదని, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల సంగతీ అలాగే ఉందని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల గిరిజన విశ్వవిద్యాలయాలకు 2022-23 సంవత్సర బడ్జెట్ కన్నా 15 శాతం కోత విధించడం అమానుషమని పేర్కొన్నారు. మొత్తం 62 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్ అన్నమాటనే ఉచ్చరించకపోవడం దారుణమని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకు కొత్తగా ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. నిర్వాసితులకు మొండిచేయి చూపించారని, రాజధాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, అమరావతికి తొంటిచేయి చూపారని తెలిపారు. ఉపాధి హామీ కేటాయింపుల్లో సగం కోతపెట్టడం, ఆహారం, ఎరువులపై సబ్సిడీలను ఘోరంగా కుదించడం వల్ల సామాన్యులు తీవ్ర ఇక్కట్లపాలవుతారని వివరించారు. విద్యుత్ సంస్కరణలు, పట్టణాల్లో యూజర్ ఛార్జీలు వంటివి జనం నడ్డివిరుస్తాయని, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేసిందని తెలిపారు. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ తరగతులకు 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్డ్ జాతులకు 2.7 శాతం మాత్రమే కేటాయించారని వివరించారు. సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదని, ఆ తరగతులకు ఈ బడ్జెట్ పూర్తిగా అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలని కోరారు. ద్రోహపూరిత బడ్జెట్‌ను నిరసించవలసిందిగా ప్రజలకు రాష్ట్ర కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్లపై పన్నులు విధించాలి

- ప్రాంతీయ వైషమ్యాలను పెంచడం దారుణం
- ప్రజాసమస్యల పరిష్కారానికి కార్యాచరణ : ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సామాన్య ప్రజలపై పన్నులు పెంచితే దేశవ్యాప్త నిరసనలు, ఉద్యమాలు చేపడతామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. కడపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధనవంతులకు పన్నులు తగ్గిస్తూ, సామాన్యులపై పన్నులు పెంచుతూ ధనిక, పేదల మధ్య అంతరాన్ని ఉద్దేశపూర్వకంగానే కేంద్రం సృష్టిస్తోందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభాలు దేశాన్ని మాంద్యం దిశగా తీసుకెళ్తున్నాయని, పాలకులు మేలుకోవాలని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పాలు, పెరుగు వంటి వినియోగాలపై పన్నులు వేయడం తగదన్నారు. అదానీ, అంబానీ వంటి బిలియనీర్ల సంపదపై పన్ను పెంచాలని డిమాండ్ చేశారు. డొల్ల కంపెనీల బండారాన్ని హిడెన్‌బర్గ్ బయటపెట్టడంతో కార్పొరేట్ల బండారం మరోసారి బహిర్గతమైందని తెలిపారు. డొల్ల కంపెనీల కారణంగా ఎల్‌ఐసి, ఎస్‌బిఐ షేర్లు నష్టపోయాయని చెప్పారు. డొల్ల కంపెనీల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో సెబీ, ఇతర సంస్థల సహాయంతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవల ప్రకటించిన విధంగా విశాఖపట్నం వెళ్లడానికి ఎవరికి ఇబ్బంది లేదని, రాజధాని మారుస్తామనడం మీసొంత జాగీరు కాదని, సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర పేరుతో చిచ్చు రాజేయడం తగదని, చివరికి బూమరాంగ్ అవుతుందని హెచ్చరించారు. రాబోయే మూడు నెలల కాలానికి సంబంధించిన ప్రజాసమస్యలపై ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, ఎ.రామమోహన్, బి.మనోహర్ పాల్గొన్నారు.

ఇది కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టినది కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సిఐటియు రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఆ బడ్జెట్ కార్మికులు, రైతులు, శ్రమజీవులు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని నిరుద్యోగాన్ని పోగొట్టేందుకు, పెరుగుతున్న ధరలను తగ్గించేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఈ బడ్జెట్ సహాయపడదని అన్నారు. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను తిరస్కరించాలని కోరారు. కార్మికుల కోర్కెలకు ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారమూ చూపలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్‌కు మోడీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని విమర్శించారు. గ్రామీణ ఉపాధికి కేటాయింపుల్లో తీవ్రంగా కోతపెట్టిందన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులను కేటాయించి, సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అమలు చేయాలన్న కోర్కెను కూడా పట్టించుకోలేదని తెలిపారు. ఇపిఎస్ పెన్షనర్లకు ఎటువంటి కేటాయింపులూ చేయలేదన్నారు. తన తీరుకు తగ్గట్లుగా మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కొనసాగిస్తోందని విమర్శించారు. నగరాలు, పట్టణాల మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రభుత్వం.. ఆ సౌకర్యాలను అందుకోవాలంటే ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించాలని మెలిక పెట్టిందన్నారు. ఫైనాన్షియల్ రంగంలో మరిన్ని సంస్కరణలను ప్రతిపాదించిందని, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, బ్యాంకింగ్ కంపెనీల చట్టం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాలకు సవరణలు చేస్తామని చెప్పిందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. మరిన్ని ప్రజా వ్యతిరేక సంస్కరణలు రాబోతున్నట్లుగా బడ్జెట్ ఉపన్యాసంలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న వ్యవసాయ పరపతి సహకార రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కైంకర్యం చేస్తోందని విమర్శించారు. మోడల్ బైలాస్‌ను ప్రతిపాదించి రోడ్లు, రైళ్లు, విద్యుత్, టూరిజం తదితర రంగాల్లోకి ప్రైవేటు పెట్టుబడులను అనుమతించిందని పేర్కొన్నారు.

చేనేతకు అన్యాయం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత రంగానికి రూ.200 కోట్లు కేటాయించడం అన్యాయమని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. రూ.లక్షల కోట్ల బడ్జెట్లో చేనేతలకు రూ.200 కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి కేటాయింపులు చూస్తుంటే బిజెపి చేస్తున్న ద్రోహం అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వస్తే చేనేతలకు పెద్దఎత్తున కేటాయింపులు జరుపుతామని తెలిపారని, ఆచరణలో ద్రోహం చేశారని విమర్శించారు.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్

కేంద్ర బడ్జెట్లో కౌలు రైతులను గుర్తిస్తారని ఆశపడ్డ రైతులకు అన్యాయం జరిగిందని, కనీస ప్రస్తావన కూడా చేయలేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు తెలిపారు. రైతాంగానికి కేటాయించిన పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపజేయకపోవడం శోచనీయమన్నారు. కౌలు రైతులకు న్యాయం చేస్తామని కేంద్రం ఈ బడ్జెట్ సమావేశాల్లోనే హామీ ఇవ్వాలని కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పినా పిఎం కిసాన్ నిధికి కేటాయింపులు పెంచకపోవడం మోసమేనని తెలిపారు.

ఉద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదు

- ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రత్యేకించి ఆదాయం పన్ను విషయంలో ఉద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ పన్ను మినహాయింపు ఇస్తామన్నారని, ఇప్పుడు కేవలం రూ.3 లక్షల వరకు మాత్రమే మినహాయింపు ఇచ్చారన్నారు. అంటే రూ.50 వేలకు మాత్రమే అది వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆశించినంతగా శ్లాబ్స్ మార్పులేదని, కొత్త విధానం వల్ల వేతన జీవులకు పెద్దగా ప్రయోజనం లేదని తెలిపారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుంచి రూ.50 వేలు మాత్రమే పెంచారని, 88 సిసి సేవింగ్స్‌లో రూ.3 లక్షలు ఆశించగా, రూ.1.50 లక్షలు అలాగే ఉంచారని వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు ఏ మాత్రమూ పన్ను మినహాయింపు లేదని, దీనివల్ల మధ్య తరగతి కుటుంబాలకు ప్రత్యేకమైన ఉపయోగం లేదని వారు పేర్కొన్నారు.

ఉపాధి హామీ, ఆహార భద్రతకు తూట్లు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు పూర్తి వ్యతిరేకమైన బడ్జెట్ అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలోని పేదలకు కీలకమైన జాతీయ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత పథకాలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులను పూర్తిగా తగ్గించేశారని వారు ఒక ప్రకటనలో తెలిపారు. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.89 వేలకోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో రూ.60 వేలకోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అలాగే ఆహార భద్రతకు గత బడ్జెట్‌లో రూ.2.87 లక్షల కోట్లను కేటాయిస్తే, ఇప్పుడు రూ.1.97 లక్షల కోట్లను మాత్రమే కేటాయించి తమది పేదల వ్యతిరేక ప్రభుత్వం అని చాటుకుందని విమర్శించారు. ఆహార భద్రతకు, ఉపాధి హామీకి నిధుల కేటాయింపును పెంచకపోతే ఏప్రిల్ 5న ఢిల్లీని ముట్టడిస్తామన్నారు.

ఉన్నత వర్గాలకే ఉత్సాహం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి ఎదురైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం ఉన్నతవర్గాలను ఉత్సాహపరిచే బడ్జెట్ మాత్రమేనని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024లో లోక్‌సభ ఎన్నికలు, 2023లో రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను గమనంలో ఉంచుకుని బడ్జెట్‌లో అంకెల గారడీ చేసిందని తెలిపారు. కర్ణాటకలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలుకు చర్యలు లేకపోవడం విచారకరమన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు లేదన్నారు.

పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణాలకు నిధుల ఊసే లేదని విమర్శించారు. రాష్ట్రం పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం చిన్నచూపుతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇది ఎన్ని'కల' బడ్జెట్ అని, కేవలం అంకెల, మాటల గారడీ మాత్రమేనని పేర్కొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమ ప్రాజెక్టులకు ముప్పు !

- అభ్యంతరాలున్నా.. బడ్జెట్‌లో రూ.5300 కోట్లు
- సంక్షోభంలోకి కెసి కెనాల్, ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సి, ఆర్‌డిఎస్ ఆయకట్టు
- ఇరు రాష్ట్రాల కరువు ప్రాంతాల మధ్య చిచ్చురాజే యత్నం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిత్యం కరువు కాటకాలకు గురయ్యే రాయలసీమ ప్రాంతంలో తుంగభద్ర దిగువకాలువ, ఎగువ కాలువ, కెసి కెనాల్ కింద ఉన్న ఆయకట్టును సంక్షోభంలోకి నెట్టేలా కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్ల నిధులను కేటాయించింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి నిధులివ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం..కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇప్పటికే అభ్యంతరాలున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు భారీ స్థాయిలో నిధులు కేటాయించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరు రాష్ట్రాలకు చెందిన కరువు ప్రాంతాల మధ్య చిచ్చురాజేసి తద్వారా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితోనే మోడీ సర్కార్ జాతీయ ప్రాజెక్టులను విస్మరించి వివాదస్పద ప్రాజెక్టుకు నిధులు కేటాయించిందని విమర్శలు వస్తున్నాయి. అంతర్జాతీయ సహజ న్యాయసూత్రాలను విస్మరించి కర్ణాటక నిర్మిస్తోన్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచీ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నా, వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా ఇప్పుడు ఎన్నికల వేళ నిధులను కేటాయించడం పట్ల రాష్ట్ర రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తుంగభద్ర ప్రాజెక్టుకు ఎగువన తుంగ నదిపై 17.40 టిఎంసిలను ఎత్తిపోసేలా ఎత్తిపోతల పథకాన్ని, భద్ర నదిపై 29.4 టిఎంసిలను ఎత్తిపోసేలా మరో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. మొత్తం 5,62,500 ఎకరాలకు సాగునీరు అందించేలా అప్పర్ భద్ర ప్రాజెక్టును రూపొందించారు. అంటే తుంగభద్ర డ్యామ్‌లోకి నీరు రాకముందే ఎత్తిపోతల పథకం ద్వారా 46.8 టిఎంసిల నీటిని కర్ణాటక మళ్లిస్తుంది. తుంగభద్ర డ్యామ్‌పై ఆధారపడి రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, కడప ఉమ్మడి జిల్లాల్లో తుంగభద్ర దిగువకాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, కెసి కెనాల్ కింద ఆయకట్టు ఉంది. కెసి కెనాల్‌కు ఎక్కువ భాగం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకుంటున్నా, మిగిలిన ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సిలకు తుంగభద్ర డ్యామ్ నుండి వచ్చేనీరే ఆధారం. ఎల్‌ఎల్‌సి కింద కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌ల కింద 24 టిఎంసిల కేటాయింపులతో 1,51,134 ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. కర్ణాటకలో జరుగుతున్న జలచౌర్యంతో ఈ ఆయకట్టులో 50 వేల ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందని పరిస్థితి ఉంది. తుంగభద్ర ఎగువకాలువ కింద 42.5 టిఎంసిలతో కర్నూలు జిల్లాలో 14,774 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,38,804 ఎకరాలు, కడప జిల్లాలో 1,40,600 ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంటే ఇప్పుడు లక్ష ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందని పరిస్థితి ఉంది. తుంగభద్ర డ్యామ్ కింద ఉండే ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సిల కింద ఉన్న ఆయకట్టు భూములకు ఇప్పుడే సగం ఆయకట్టుకు కూడా నీరు అందని పరిస్థితులు ఏటా ఎదురవుతుంటే, అప్పర్ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలోని ఈ ఆయకట్టు అంతా ఎడారిగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఆర్‌డిఎస్ కింద ఉన్న 75 వేల ఎకరాల పరిస్థితి కూడా అప్పర్ భద్ర ప్రాజెక్టుతో ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు కింద ఉన్న దిగువ ప్రాంత రైతుల హక్కులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎన్నికల లబ్ధి కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అప్పర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కరువు ప్రాంతాన్ని విస్మరించడం తగదు : జి ఓబులు, రాయలసీమ సబ్ కమిటీ సభ్యులు

ప్రతిఏటా వర్షాభావ పరిస్థితులతో కరువు పరిస్థితులను ఎదుర్కొనే రాయలసీమ ప్రాంతానికి ఉన్న ప్రధాన నీటి వనరు తుంగభద్ర డ్యామ్. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు తుంగభద్ర డ్యామ్‌లోకి నీరు రాకముందే నీటిని మళ్లించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిపై రాష్ట్ర బిజెపి స్పందించాలి. ఈ చర్యతో రాయలసీమలో మరింత దుర్భిక్ష పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది. తుంగభద్ర నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ కేటాయించిన వాటా నీటికి గ్యారెంటీ ఇవ్వకుండా కొత్త ప్రాజెక్టులను చేపట్టడం బిజెపి ద్వంద్వ వైఖరి చూపుతోంది.

మహిళలకు కేటాయింపులు పిసరంత : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్లో మహిళా సాధికారతకు రూ.3,144 కోట్లు, బిడ్డల అభివృద్ధికి, రక్షణ కోసం కేటాయించిన వాత్సల్య పథకానికి రూ.1,472 కోట్లు మాత్రమే కేటాయించారని, పిసరంత కేటాయింపులు దేనికీ సరిపోవని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి విమర్శించారు. గత బడ్జెట్లో కేటాయించిన నిధుల్లోనూ రూ.1,100 కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించారన్నారు. అన్ని పథకాలకూ కేటాయింపులు తగ్గించారని పేర్కొన్నారు. ఆహార సబ్సిడీ గతం కంటే 31 శాతం తగ్గిందని వివరించారు.

ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆదాయపు పన్ను విషయంలో ఉద్యోగులకు ఒరగబెట్టింది ఏమీ లేదని ఎపిటిఎఫ్ పేర్కొంది. విద్యారంగానికి కేవలం 2.5 శాతం బడ్జెట్‌ను కేటాయించడం కంటితుడుపు చర్య అని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీనియర్ సిటిజన్లకు ఏమాత్రం పన్ను మినహాయింపు లేదని, దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగం లేదని తెలిపారు.

విద్యారంగానికి నిధులు కోత : పిడిఎస్‌యు

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కోత పెట్టారని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం రామకృష్ణ విమర్శించారు. గతేడాది కేటాయింపులు, సవరించిన అంచనాల కంటే మరిన్ని నిధులకు కోత విధించారన్నారు.

విద్యారంగానికి అరకొర నిధులు

- వేతన జీవులకు ఎలాంటి ఉపయోగమూ లేదు
- యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించిందని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ విమర్శించింది. విద్య బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అర్థమవుతోందని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినా.. ప్రస్తుత బడ్జెట్‌లో జిడిపిలో 0.3 శాతం, మొత్తం బడ్జెట్‌లో 2.5 శాతం మాత్రమే కేటాయించినట్లు విమర్శించారు. గతేడాదితో పోలిస్తే 0.12 శాతం పెరిగినట్లు అనిపిస్తున్న ఈ నిధులు ప్రభుత్వ రంగంలో విద్య నిర్వహించడానికి ఏమాత్రం సరిపోవని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు 2 శాతం కేటాయించాల్సి ఉండగా, 0.7 శాతం మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. శాస్త్రీయ ఆలోచన కలిగిన విద్యార్థుల్ని తయారుచేయడానికి అవరోధం ఏర్పడుతుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలను ప్రైవేట్ రంగానికి అప్పజెప్పే దిశగా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదన ఉందని తీవ్రంగా ఆక్షేపించారు. పన్ను మినహాయింపు కోసం ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి పెరుగుదల లేదని తీవ్రంగా ఖండించారు. రూ.5 లక్షల లోపు పన్ను మినహాయింపు ఉంటుందని ఆశించిన వారికి తీవ్ర నిరాశ కలిగిందని తెలిపారు. రూ.7 లక్షల లోపు మినహాయింపు అనేది కొత్త పన్ను విధానానికి మాత్రమే వర్తిస్తుందని, ఇది ఉపయోగపడదని పేర్కొన్నారు. బడ్జెట్ ఆమోదం పొందేలోపు పన్ను మినహాయింపును రూ.5 లక్షలకు సవరించాలని, సేవింగ్స్ రూ.3 లక్షలకు పెంచాలని, శాస్త్ర సాంకేతిక రంగాలకు నిధులు కేటాయించి ప్రభుత్వ పరిశోధనలు ప్రోత్సహించాలని కోరారు.

సంపాదకీయం

సబబేనా!


రాజధాని అంశం దేశ సర్వోన్నత న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పటికీ విశాఖపట్నం త్వరలో రాష్ట్ర రాజధాని కాబోతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారంనాడు చెప్పడం కలకలం రేపింది. ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ డిప్లమాటిక్ అలయెన్స్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ మార్చి మూడు, నాలుగు తేదీల్లో విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు వారిని రమ్మని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని, దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందనీ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా గడిచిన మూడేళ్లుగా ఏపి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచిందనీ చెప్పారు. రాష్ట్రానికి 974 కిలోమీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉందని, ఆరు పోర్టులు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా మరో నాలుగు పోర్టులను నిర్మిస్తున్నట్లు, ఆరు విమానాశ్రయాలు కూడా ఉన్నాయనీ, రాష్ట్రంలోని ప్రకృతి వనరులను గురించి చెప్పడాన్ని తప్పుబట్టలేం. పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించాలనీ, పెట్టుబడులను రాబట్టాలనీ ప్రయత్నించడం తప్పు కాదు. ఒక ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యత కూడా! అయితే, మూడు రాజధానులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవడం, అమరావతిని రాజధానిగా అభివద్ధి చేయాలని హైకోర్టు ఆదేశించడం, సుప్రీం కోర్టులో సంబంధిత కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆ వ్యాఖ్యలు చేయడం సబబేనా అన్నది పలువురి సందేహం. ముఖ్యమంత్రి ప్రకటన కోర్టు ధిక్కరణ కిందకి వస్తుందన్న కొందరి అభియోగాన్ని కూడా తీసి పారెయ్యలేం.

అమరావతి రాజధానిగా రాష్ట్ర అసెంబ్లీలో నాడు వైసిపి సహా ఏకగ్రీవ ఆమోదం పొందింది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతిని రాజధానిగా అంగీకరించాయి. రాజధాని నిర్మాణం కోసం రైతులు వేల ఎకరాల భూములను ప్రభుత్వానికిచ్చారు. అమరావతి అభివద్ధికి ఇప్పటికే వేల కోట్ల రూపాయలను సర్కారు ఖర్చు చేసింది. అయితే అంత భారీ విస్తీర్ణంలో సినీ గ్రాఫిక్స్ లాంటి నిర్మాణాలను చూపి అమరావతిని ఓ భ్రమరావతిగా మార్చిన గత ప్రభుత్వ నిర్వాకాన్ని తప్పక తప్పుబట్టాల్సిందే. అయితే ఏకంగా ఆ ప్రదేశంలోనే రాజధాని ఉండబోదని కొత్తగా వచ్చిన ప్రభుత్వం చెప్పడం తగదు. ఏ రాజకీయపార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వం అనేది ఒక వ్యవస్థగా కొనసాగుతుంది. ఆ సూత్రం ప్రకారం కూడా అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా కొనసాగాలి.

ఉమ్మడి రాష్ట్ర విభజన మూలంగా అవశేష ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. ఒకే రాష్ట్రంలో ఉన్నా కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉండడం లేదా నిర్లక్ష్యం చేయబడడం వల్ల వేర్పాటువాదానికి ఊతమొచ్చింది. విభజన గాయాలను ఎవరూ మరువరాదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిందే. అందుకు బాధ్యత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. కాని, రాష్ట్రాభివృద్ధికి కీలకమైన ప్రత్యేక హోదాను కేంద్రం తిరస్కరించడమేగాక విభజన హామీలను కూడా తుంగలో తొక్కుతోంది. అయినా ఆంధ్రప్రదేశ్‌లోని అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీయడంలేదు సరికదా వారికి తోడుగా నిలవడం విచారకరం. నిజానికి ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉంటే పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడానికి ముఖ్యమంత్రి అంతగా ప్రయాస పడకుండా వారే క్యూ కట్టేవారు. కాబట్టి హోదాపై రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్ర బిజెపిని నిలెయ్యడం, దాని మెడలు వంచి హోదా సాధించడమే మార్గం.

వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి. జంఝావతి, వంశధార తదితర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి కావలసిన నిధులు కేటాయించాలి. ప్రాణ బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు పరం కానివ్వకుండా కార్మికవర్గం సాగిస్తున్న పోరాటానికి అన్ని పార్టీలు అండగా నిలవాలి. ఉమ్మడిగా పట్టుబట్టి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరింపజేయాలి. ఇలాంటివి చేయకుండా విశాఖను రాజధానిగా ప్రకటించినంత మాత్రాన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, కొంతమంది సంపన్నులకు లబ్ధి చేకూరుతుందే తప్ప సామాన్య ప్రజలకు, రాష్ట్రానికీ ఒరిగేదేమీ ఉండదని గుర్తెరగాలి!

మహనీయుని మాట



ప్రకృతిని నిర్లక్ష్యం చేయడమంటే...
మనిషి నేల విడిచి సాము చేయడమే.
జీన్ జాక్ రూసో,
తత్వవేత్త, స్విట్జర్లాండ్.

విశ్లేషణ

పాత పెన్షన్ విధానంపై బిజెపి ప్రభుత్వ దాడి





ఎ. కోటిరెడ్డి

పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటానికి వ్యతిరేకంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, బడా పెట్టుబడిదారులు, వారికి అనుకూలంగా ఉన్న మీడియాతో పాటు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా రంగంలోకి దూకింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తే ప్రభుత్వ వనరులపై తీవ్ర ఒత్తిడి పడుతుందని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. నూతనంగా ఎన్నికైన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు జరుపుతామని ప్రకటించిన కొద్ది రోజులకే ఆర్‌బిఐ ఈ ప్రకటన చేసింది. అంతకు ముందు పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ రెండు ప్రభుత్వాలు ప్రకటించటానికి ముందే కాంగ్రెస్ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించాయి. విద్య, వైద్యం, కాలుష్య రహిత విద్యుత్, మౌలిక వసతుల రంగాలలో పెట్టుబడులకు రాష్ట్రాలు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర పథకాలకు పెట్టే ఖర్చులు పోనూ మిగతా మొత్తాన్ని పెట్టుబడులకు కేటాయించాలనే ఆలోచన సరైనది కాదని "భారతదేశంలో పెట్టుబడుల పెంపుదల- రాష్ట్రాల పాత్ర" అంశంపై రూపొందించిన నివేదికలో ఆర్‌బిఐ పేర్కొంది. పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవద్దని, సిపిఎస్‌నే అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఈమధ్యనే రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది.

ఈ విధంగా ఉద్యోగులు, కార్మికులకు ప్రయోజనం కలిగించే పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటానికి చేస్తున్న ప్రయత్నాలను సరళీకరణ విధానాల సమర్థకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడి, బిజెపి నాయకత్వం అంతా పాత పెన్షన్‌కు తిరిగిపోవటానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా పాత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకించటంలో ముందెత్తున ఉన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయటం అంటే రానున్న తరాల భవిష్యత్‌ను తాకట్టు పెట్టటమేనని వీరంతా వాదిస్తున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే ప్రభుత్వాలకు అయ్యే ఖర్చు ఎంత, పెరుగుతున్న జిడిపి, ప్రభుత్వ ఆదాయాలు తదితరాలను పరిశీలిస్తే ఈ వాదనలోని డొల్లతనం బయటపడుతుంది.

ప్రస్తుతం లభిస్తున్న సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 48 లక్షలు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు 10 లక్షలు, ప్రభుత్వబ్యాంకుల ఉద్యోగులు 8 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు 1.32 కోట్లు. మొత్తం కలిపితే 1.98 కోట్లమంది ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మనదేశ జనాభాలో సుమారుగా 1.5 శాతం, 50 కోట్ల మంది శ్రామిక ప్రజలలో 4 శాతంగానూ ఉన్నారు. 2014లో పెన్షన్ పొందుతున్న రిటైరైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 51.96 లక్షల మంది ఉన్నారు. వీరిలో రక్షణరంగంలో పనిచేసి పెన్షన్లు పొందుతున్నవారు 46.5 శాతం ఉన్నారు. త్రివిధ సైనిక బలగాలలో ఉన్నవారు తక్కువ వయసుకే రిటైరవటం వారిలో పెన్షనర్ల శాతం ఎక్కువగా ఉండటానికి కారణం. రిటైరయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించటం కోసం కేంద్ర ప్రభుత్వం 2013-14లో 1,04,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఇందులో 44 శాతం రక్షణ బలగాల నుండి రిటైరైన వారికి చెల్లించారు. మొత్తం వ్యయంలో 7.8 శాతం జీతాలకు, 4.6 శాతం పెన్షన్లు చెల్లించటానికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

కేంద్ర ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌ను 34,83,236 కోట్ల వ్యయంగా ప్రతిపాదించింది. 2019-20 ఫైనల్‌గా జరిగిన వ్యయం లెక్కల కన్నా ఇది 14 శాతం అధికం. దీనిలో ప్రణాళికేతర ఖర్చు 29,29,000 కోట్ల రూపాయలు. ఇది 12 శాతం అధికం. ప్రణాళిక ఖర్చు 5,54,236 కోట్ల రూపాయలు. ఇది 29 శాతం అధికం. పెరుగుతున్న ప్రభుత్వ ఆదాయాలు, ఖర్చులు పెన్షన్లకు ఖర్చు పెడుతున్న మొత్తం కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నాయని పై లెక్కలు వెల్లడిస్తున్నాయి.

సంఘటిత రంగంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల శాతం క్రమంగా తగ్గిపోతున్నది. 1994లో సంఘటిత రంగ ఉద్యోగులలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 12.4 శాతం ఉండగా, 2012 నాటికి 8.5 శాతానికి తగ్గిపోయారు.

భవిష్యత్‌లో తగ్గనున్న పెన్షన్ భారం

2022 సంవత్సరంలో మనదేశ జిడిపి 3.469 లక్షల కోట్ల డాలర్లు. రూపాయల్లో 284 లక్షల 45 వేల 8 వందల కోట్ల రూపాయలు. దీనిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లకు చెల్లించేది 1.20 లక్షల కోట్ల రూపాయలు. మొత్తం జిడిపిలో 0.4 శాతం ఉంటుంది. మొత్తం ఉద్యోగులలో రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు 66 శాతం ఉన్నారు. కేంద్రం చెల్లిస్తున్న నిష్పత్తిలో వారి పెన్షన్లకు మరో 2.40 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. ఇది జిడిపిలో 0.8 శాతం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పెన్షన్లకు చెల్లించేది జిడిపిలో 1.2 శాతం అవుతుంది. జనాభాలో 1.5 శాతంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబసభ్యులను కూడా కలుపుకుంటే 6 శాతం అవుతారు. మొత్తం జిడిపిలో 1.2 శాతాన్ని శ్రామికశక్తిలో 4 శాతంగా ఉన్న ప్రభుత్వోద్యోగుల పెన్షన్ కోసం ఖర్చు పెట్టలేమని చెప్పటం హాస్యాస్పదం. ఈ వాదన ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టటానికి ఉద్దేశించినది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తే భవిష్యత్‌లో భరించలేని భారం అవుతుందని వాదిస్తున్నారు. దేశ జిడిపి పెరుగుదల, ప్రభుత్వాల ఆదాయం, ఖర్చులలో పెన్షన్ చెల్లింపులకు చేస్తున్న ఖర్చు అతి తక్కువగా ఉండటం వలన ఇపుడివ్వలేమని చెబితే హాస్యాస్పదంగా ఉంటుంది కాబట్టి...భవిష్యత్ పేరుతో పాత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు.

ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉన్న మన జిడిపి రానున్న సంవత్సరాలలో చైనాను అధిగమిస్తుందని ఏలికలు గొప్పలు చెప్పుకుంటున్నారు. తక్కువలో తక్కువ 2022-23లో జిడిపి 6 శాతానికి మించి పెరుగుతుందని అంచనాలు వేస్తున్నారు. ఆ లెక్కన పెరిగినా ఈ దశాబ్దం చివరికి మన జిడిపి రెట్టింపుకు పైగా పెరుగుతుంది. అదే నిష్పత్తిలో ప్రభుత్వాల ఆదాయం కూడా పెరుగుతుంది. కాని ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగకపోగా తగ్గుతున్నది. కాబట్టి రానున్న సంవత్సరాలలో జిడిపి, ప్రభుత్వాల ఆదాయాలలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌లకు చెల్లించే మొత్తం తగ్గుతుంది. కాని ఈ విషయాన్ని కప్పిపెట్టి, రానున్న కాలంలో ఉద్యోగులకు చెల్లించే పెన్షన్ భారం పెరుగుతుందని, ఆదాయం మాత్రం ఇపుడున్నంతే ఉంటుందన్న అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి.

ఉద్యోగులకు పెన్షన్ చెల్లించటంపై ఇంత గగ్గోలు పెడుతున్న ప్రభుత్వాలు, సరళీకరణ విధానాలను సమర్థించే మేధావులు, ఆర్థికవేత్తలు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన పెరుగుతున్న జిడిపిలో సింహభాగం బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవటాన్ని గురించి మాత్రం నోరు మెదపటం లేదు. ప్రభుత్వ విధానాల వలన అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులు దేశ సంపదను తమ స్వంతం చేసుకుంటున్నారు. అదానీ ఆదాయం గంటకు 100 కోట్లు దాటిపోగా, అంబానీ గంటకు 90 కోట్ల రూపాయలకు పైగా సంపదను స్వంతం చేసుకుంటున్నాడు. వీరిరువురి ఆదాయం కలిపితే రోజుకు 5,000 కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది. వీరికి 24 రోజులలో వచ్చే ఆదాయంతో రిటైరయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు. మరో 48 రోజుల ఆదాయంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు.

అందువలన ఉద్యోగులకు పెన్షన్ చెల్లించటం భారం అవటం వలన కాక, మొత్తం ఆదాయాన్ని అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు తరలించటానికి ఆటంకంగా ఉంటుందనే పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది. బడా పెట్టుబడిదారులకు ఏజంట్లుగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే దారిలో నడుస్తున్నాయి. కేవలం పెన్షన్‌లపైనే కాక, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై కూడా దాడి చేస్తున్నాయి.


కాబట్టి సరళీకరణ విధానాలతో ప్రభుత్వోద్యోగుల పెన్షన్‌పైనే కాక, జీతాలు, ఇతర సదుపాయాలపై కూడా దాడి చేస్తున్నారు. ఈ దాడిని ప్రతిఘటించి, తిప్పికొట్టకపోతే ఉద్యోగ భద్రతతో పాటు అన్నింటినీ హరిస్తారు. అందుకే పాత పెన్షన్ విధానంపై ప్రభుత్వాల దాడిని ప్రతిఘటించటం అత్యవసరం. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుకాకపోతే ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు పెన్షన్ ఊసే ఉండదు. అందువలన పెత పెన్షన్ విధానం కావాలని ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటాన్ని ప్రైవేటురంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సంపూర్ణంగా బలపరచాలి. ★

> ప్రభుత్వ విధానాల వలన అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులు దేశ సంపదను తమ స్వంతం చేసుకుంటున్నారు. అదానీ ఆదాయం గంటకు 100 కోట్లు దాటిపోగా, అంబానీ గంటకు 90 కోట్ల రూపాయలకు పైగా సంపదను స్వంతం చేసుకుంటున్నాడు. వీరిరువురి ఆదాయం కలిపితే రోజుకు రూ. 5,000 కోట్లకు పైగా ఉంటుంది. వీరికి 24 రోజులలో వచ్చే ఆదాయంతో రిటైరయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు. మరో 48 రోజుల ఆదాయంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు.

సమస్య

వెనుకబడిన ప్రాంతాలు - అసమానతలు!





వి. శంకరయ్య

ప్రాంతీయ అసమానతలు, ప్రాంతీయ వాదం విడదీయ లేని కవల పిల్లలు. నాయకులు తమ రాజకీయ ఉనికి లేక అవసరార్థం ప్రాంతీయ అసమానతలు పెంచి పోషించుతూ మరోవైపు ప్రజల్లో తలెత్తుతున్న అసంతృప్తిని భావోద్వేగాలకు ఉపయోగించుకొంటున్నారు.

అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ ప్రాంతీయ అసమానతలు కొనసాగడానికి కేంద్ర ప్రభుత్వం తొలి ముద్దాయి. రాష్ట్రాధినేతలూ ఇందుకు తీసిపోలేదు. దేశంలో తరచుగా రాష్ట్రాధినేతలు ఇతర అభివద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా తమ రాష్ట్రం పురోగతి సాధించేందుకు ప్రత్యేక పథకాలు, రాయితీలు అవసరమని కేంద్రాన్ని కోరుతుంటారు. అంత వరకు బాగానే ఉన్నా...అదే రాష్ట్రానికి వచ్చేసరికి అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా వెనుక బడిన జిల్లాలు అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ఒక్క పైసా అదనంగా విదల్చక పోవడమే నేటి విషాదం.

రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46(3)లో రాయలసీమ ఉత్తరాంధ్ర ఏడు జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ పొందుపర్చారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2014 ఫిబ్రవరి 20వ తేదీ రాజ్యసభలో మాట్లాడుతూ రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు బోలంగీర్ కలహండి తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. కాగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లో వ్యాపించి వున్న బుందేల్ ఖండ్ తరహాలో ఈ ప్యాకేజీ వుంటుందన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ. 24,350 కోట్లతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపితే ముష్టిగా జిల్లాకు రూ. 50 కోట్లు చొప్పున మూడేళ్లు ఇచ్చి తర్వాత ఎగ్గొట్టారు. ఇప్పటికీ సవా లక్ష కొర్రీలు వేస్తున్నారు. విభజన చట్టం సెక్షన్ 94 (3) మేరకు వెనుక బడిన జిల్లాల్లో భౌతిక సామాజిక వనరులు అభివృద్ధి చేయాలి. ఈ చట్ట బద్ధ హక్కులు హుష్ కాకి అయ్యాయి. ఇక ప్రత్యేక హోదా వుండనే వుంది.

నాణేనికి ఇది ఒక వైపు అయితే మరో వైపు కూడా రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల ఫలితంగా ప్రజల్లో నివురు గప్పిన నిప్పులాగా వున్న అసంతృప్తిని కొందరు నేతలు తమ రాజకీయ అవసరార్థం ఉపయోగించుకొంటున్నారు. వాస్తవంలో ఆయా వెనుకబడిన ప్రాంతాల భౌతిక పరిస్థితులు ప్రజల అవసరాలు వీటితో పాటు వారి వాంఛలు ఆధారం చేసుకొని ప్రత్యేక పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. కాని ఆ దిశగా చర్యలు లేక పోవడంతో మంత్రి ధర్మాన ప్రసాదరావు గాని రాయలసీమలో కొందరు నేతలే కాకుండా ప్రత్యేకించి ఒక సెక్షన్ యువత వేర్పాటు వాదం తెర మీదకు తెస్తున్నది. ఉత్తరాంధ్రలో విస్తారమైన సముద్ర తీరం వున్నందున పైగా విశాఖలో నౌకాదళం కేంద్రం వున్నందున మిగతా జిల్లాలతో పోల్చుకొంటే విశాఖ జిల్లా కొంత మెరుగ్గా వుంది. ధర్మాన ప్రసాదరావు మంత్రిగా వున్నప్పుడే వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రూపుద్దుకున్నది. ఈ పథకం అమలు జరిగితే ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు 30 లక్షల మందికి తాగునీటి వసతి ఏర్పడుతుంది. విజయ నగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ మూడేళ్ల కాలంలో ఎప్పుడైనా మంత్రులు బొత్స సత్యనారాయణ ధర్మాన ప్రసాదరావులు ఈ పథకం అమలు జరగలేదని మంత్రి పదవులకు రాజీనామాకు సిద్ధమై వుంటే వీరి చిత్తశుద్ధి శంకించలేము. కాని భావోద్వేగాలతో ప్రజల్ని రెచ్చగొట్టేందుకు మంత్రి పదవులు త్యాగం చేస్తామంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి అనుసంధానం ఏళ్ల కొద్దీ ఎందుకు నానుతుంది? వంశధారపై నెరెడి బ్యారేజీ నిర్మాణం గుర్తు వుందా? వ్యవసాయంపై ఆధారపడే లక్షలాది మంది ఉత్తరాంధ్ర రైతులకు సాగునీరు కావాలా? ఇవేవీ లేకుండా పరిపాలన రాజధాని కావాలా? పోలవరం ప్రాజెక్టు నుండి విశాఖ తాగునీటికి 23.99 టియంసిలు నీరు కేటాయించారు. పోలవరం గాలిలో దీపమైంది!

రాయలసీమ పరిస్థితి మరీ దుర్భరంగా వుంది. ఈ ప్రాంతంలో విస్తారమైన బీడు భూములున్నాయి. ఎక్కువ భాగం వర్షాధార పంటలైనందున మొత్తంగా నీళ్ల నీళ్ల అని ప్రజలు తుదకు తాగునీటికి తపిస్తుంటారు. ఈ ఏడు విస్తారంగా వర్షాలు పడ్డాయి. కాని గ్రామాల్లో ఉపాధి లేక గ్రామాలకు గ్రామాల ప్రజలు వలసలు పోతున్నారు. మరీ దారుణమేమంటే కెసి కెనాల్ కింద ఆయకట్టులో పెట్టిన పంటలకు నీళ్లు అందే అవకాశం లేదని నేడు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాటికే హంద్రీనీవా కింద కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో పంటలు ఎండిపోయాయి.

బచావత్ ట్రిబ్యునల్ కెసి కెనాల్ కు తుంగభద్ర నుండి 39.9 టియంసిలు నీరు కేటాయించినది. దురదృష్టం ఏమంటే దశాబ్దాలు గడుస్తున్నా 2.65 లక్షల ఎకరాలు ఆయకట్టుగల కెసి కెనాల్ కు 1.25 టియంసిలు సామర్థ్యం గల సుంకేసుల బ్యారేజీ తప్ప నీళ్లు నిల్వ చేసే వసతి లేదు. 2.965 టియంసిలు నిల్వ సామర్థ్యంతో నిర్మించిన అలగనూరు రిజర్వాయర్ లో నీరు నిల్వ చేసే అవకాశం లేక పశువుల మేత పొరంబోకుగా వుంది. బచావత్ ట్రిబ్యునల్ గాని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ గాని సుంకేసుల బ్యారేజీ నుండి (21+10)టియంసిల నీరు మాత్రమే శ్రీశైలం జలాశయం చేరుతుందని తేల్చారు. కాని ఏటా వందల టియంసిలు కలుస్తున్నాయి. ట్రిబ్యునల్ కేటాయింపులు అరకొరగా వున్నా చట్టబద్ధత గల నీళు వర్షపు నీరు నిల్వ చేసుకొనే ఏర్పాట్లు జరిగి వుంటే రాయలసీమలో కొంతలో కొంత నీటి కొరత తీరేది.

కెసి కెనాల్ ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన గుండ్రేవుల రిజర్వాయర్ హుళక్కి అయింది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రాయలసీమ ఎత్తిపోతల పథకం న్యాయ రాజధాని రెండు పథకాలకు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి రాయలసీమను కోనసీమ చేస్తామన్నారు. ఎత్తిపోతల పథకం కోర్టు వివాదంలో చిక్కుకున్నది. న్యాయ రాజధాని కాదు కదా తుదకు కృష్ణ యాజమాన్య బోర్డు కార్యాలయం గతి లేకపోయింది. ఈ మధ్య సీమ రైతులు రోడెక్కి సిద్దేశ్వరం కోసం పోరాటం మొదలు పెట్టారు. దురదృష్టమేమంటే రాయలసీమలో చిన్న కాలువ తవ్వాలన్నా తెలంగాణ ఇంజనీరింగ్ చీఫ్ యాజమాన్యం బోర్డుకు రేఖ రాసి అడ్డుకొంటున్నారు. ఇరువురు ముఖ్యమంత్రులు బాగానే వున్నా (చంద్రబాబుతో పోల్చితే) రెండు రాష్ట్రాల మధ్య గల అంతర్ రాష్ట్ర జల వివాదాలు సామరస్యంగా పరిష్కారానికి కృషి జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోంది. కాగా గత ప్రభుత్వం ఏం చేసింది అనేది పక్కన పెడితే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడేళ్ల కాలంలో సాగునీటి రంగంలో 19 వేల కోట్ల రూపాయలు వ్యయం చేసిందంటే ఇందులో వెనుక బడిన ప్రాంతాల భాగం అతి స్వల్పమే. రాష్ట్రంలో వెనుకబడిన ఈ రెండు ప్రాంతాల్లో పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. ప్రాంతీయ అసమానతలు నెలకొన్నాయి. అవేవీ పట్టించుకోకుండా పరిష్కార మార్గాలు చూడకుండా పాలకులు కాలం వెళ్లదీస్తే కుదరదు.

/ వ్యాసకర్త : విశ్రాంత పాత్రికేయులు,
సెల్ : 9848394013 /

> అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ ప్రాంతీయ అసమానతలు కొనసాగడానికి కేంద్ర ప్రభుత్వం తొలి ముద్దాయి. రాష్ట్రాధినేతలూ ఇందుకు తీసిపోలేదు. దేశంలో తరచుగా రాష్ట్రాధినేతలు ఇతర అభివద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా తమ రాష్ట్రం పురోగతి సాధించేందుకు ప్రత్యేక పథకాలు, రాయితీలు అవసరమని కేంద్రాన్ని కోరుతుంటారు. అంత వరకు బాగానే ఉన్నా...అదే రాష్ట్రానికి వచ్చేసరికి అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా వెనుక బడిన జిల్లాలు అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ఒక్క పైసా అదనంగా విదల్చక పోవడమే నేటి విషాదం.

కవిత్వం

మట్టి చిగుళ్ళ స్వప్నం

మట్టి పిసికిన చేతులు నేర్పాయి అమ్మపాటను
కల్లోలాన్ని సృష్టించమనలే
కార్చిచ్చులు రేపమనలే
కఠిన పాషాణ హృదయాలను
ద్రవీభవనం చేశాయే తప్ప
ఏ యుద్ధానికో ఏ ప్రమాద ప్రయోగాలకో
వంతెనలు వెయ్యమనలే...
ఒకానొక ఇసుక గూళ్ళ
స్వప్నాల వాసనలను గవ్వల్లో ఆల్చిప్పల్లో
భద్రంగా దాచిన తీరాల వెంట
ఎప్పుడూ స్వచ్ఛమైన
ప్రభాత వదనాలతో ఆకాశంకేసి
ఆడుకోమన్నాయి పాడుకోమన్నాయి
దేహాలకు ఇంద్రధనుస్సు రంగులే
అంటాలె తప్ప రక్తం మరకలు కాదు
బుద్ధి జీవనదిలో తేటగా
తేలియాడుతూ మురికిని
పొగొట్టుకుంటూ పారాలె
మనస్సు విభిన్న పూల పరిమళాల మధ్య
కర్మ మందిరానికి అంకితమవ్వాలె
గతి తర్కం భౌతికం మనల్ని
మెలకువలో ఈదేట్టు చూడాలె...
వికారాలు చుట్టుముడితే
ఆ మట్టిచేతులనే తలుచుకోవాలె
అవి నేర్పిన నిర్మితుల నమూనా
మానవత్వపు వెలుగు కిరణాల అల్లిక
మనమంతా బతుకునేత కార్మికులం
పేర్చుదాం నిఖార్సైన మట్టిపెళ్లల్ని
ప్రేమతత్వపు కొలిమిలో కాల్చబడ్డవి అవి
కడదాం ఆ చేతులకు చిగుళ్లను
అవి పాకుతూ ఆ పాటల్ని పాడుతుంటాయి!

- రఘు వగ్గు

చరిత్ర సాక్షిగా... !!

నదులన్నీ కలిసిన సరిగమల కలగూరగంప
నయాగరా..
నయాగారాని జలపాతం అన్నదెవరు..?
పడినా, లేచి పరుగెత్తే జీవనశైలికి ఆదర్శం
గాయమైనా పాలనవ్వుల సందేశం నయాగరా
మిట్టపల్లాలు, కష్టనష్టాలు, ఎగుడు దిగుడుల సాక్ష్యంగా
సరికొత్త జీవన సంగీతం వినిపిస్తుంది
వినే హృదయమే వుండాలి కాని
శతకోటి పక్షుల కిలకిలా రావాల ఆదర్శం
చినుకు చినుకుగా కురిసిన ఆకాశం సృష్టించిన
స్వచ్ఛంద సమైక్య గర్జనా మహాకావ్యం అది
చావు పుటకల రహస్యం విప్పిచెప్పే ధర్మక్షేత్రం
ప్రాణదానం చేస్తూ అడుగులు కదపటం ఒక కళ
ఎన్ని పర్వతాలు, ఎన్నెన్ని శిఖరాలు అడ్డంగా నిలుచున్నా
నర్మగర్భంగా తప్పించుకుని నడవడం
ఎవరు నేర్పారో ?
పున్నమి రోజు తనూ వెన్నెలై దూకాలని
అమావాస్య చీకట్లో పరచిన వెలుతురు దుప్పటై పోవాలని
కలలు నిజం చేసుకునే పరుసవేది తాకించిందెవరో ?
కాలంలా ఆగని రహస్యం నయాగరా !
శతాబ్దాలు గడిచినా ఉడిగిపోని ఉత్సాహం
అదేనా కాలానికీ - నీకూ మధ్య స్నేహ ఒప్పందం
భూగోళం తిరుగుతున్నంత భీకర ధ్వనితో
శాంతి కాహళి వూదుతూ నీ పయనం అజరామరం..!!

- డా॥ పెరుగు రామకృష్ణ,
సెల్ : 9849230443

కాలంతో పరుగులు!

కాలంతో పరుగులు
పెడుతోంది జీవితం
కాలంతో ఉరకలు
వేస్తోంది జీవనం
ఈ జీవితంలో ఎన్నెన్నో
మరపురాని సంఘటనలు
ఊహించలేని
మలుపులు మజిలీలు
అందుకే నేనంటాను
కాలం ఒక వేగం
కాలం ఒక ప్రవాహం
కాలం విలువ తెలుసుకో
కాలంతో నువ్వు కూడా
పరిగెత్తాలి
జీవితం కాలంతో
ముడి పడింది కాలం
వృథా చేయకు నేస్తమా
ఈ కాలం చేతిలో కీలుబొమ్మ
గడియారం!
కీ ఇస్తేనే ఆడుతుంది, నడుస్తుంది.

- ఎల్.ప్రఫుల్లచంద్ర, సెల్ : 6300546700

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com



విద్యారంగంలో సిఎం కృషి అభినందనీయం

మోటివేషనల్ స్పీకర్ నిక్ ఫుజిసిక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఫుజిసిక్ తెలిపారు. బుధవారం ఉదయం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. పదో తరగతిలో తన పాఠ్యాంశం పెట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నిక్ మాట్లాడుతూ విద్యారంగంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోందని తెలిపారు. ప్రైవేటు స్కూళ్లకు తీసిపోని రీతిలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యారంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా మరింత మెరుగైన ఫలితాల కోసం దీర్ఘకాలిక లక్ష్యంతో సిఎం పనిచేస్తున్నారని తెలిపారు. నిక్ వెంట విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నిలకడగా తారకరత్న ఆరోగ్యం

- ఎంపి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టాలీవుడ్ హీరో తారకరత్న ఆరోగ్యం నిలకడగా ఉందని వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్నను పరామర్శించారు. డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తారకరత్నకు మంచి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారని, గురువారం నుంచి పురోగతి ఉండే అవకాశం ఉందని తెలిపారు. అన్ని విషయాలను బాబాయ్ బాలకృష్ణ దగ్గరుండి చూసుకుంటున్నారని చెప్పారు. తారకరత్నకు గుండెపోటు వచ్చిన రోజు 45 నిమిషాల పాటు మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడం వల్ల నరాలు కాస్త దెబ్బతిన్నాయని, ప్రస్తుత పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని తెలిపారు.

'ఉపాధి'కి రూ.297 కోట్లు విడుదల

- పంచాయతీరాజ్ కమిషనరు కోన శశిధర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధి హామీ వేతనాల చెల్లింపుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఏడో విడతగా రూ.297.41 కోట్లను మంజూరు చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు కోన శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి విడతగా రూ.929.20 కోట్లు, రెండో విడతగా రూ.228.91కోట్లు, మూడో విడతగా రూ.670.58 కోట్లు, నాలుగో విడతగా రూ.1,769.29 కోట్లు, ఐదో విడతగా రూ.77.11 కోట్లు, ఆరో విడతగా రూ.386.81 కోట్లు మదర్ శాంక్షన్‌గా మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.3,943.57 కోట్లు రోజువారీ వేతన ఎఫ్‌టిఒల అప్‌లోడ్ ఆధారంగా నేరుగా వేతనదారుల ఖాతాలకు జమయ్యాయని తెలిపారు.

రేపు డిపోల ఎదుట నిరసనలు


- ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించాల్సిన అలవెన్సులు, ఓడిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. ఉద్యోగులంతా ఈ నెల 3న అన్ని డిపోల ఎదుట భోజన విరామ సమయంలో నిరసనలు తెలపాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఎలాంటి అలవెన్స్‌లను ఇవ్వకుండానే ఎక్కువ టైమ్ పనిచేయించుకోవడం తగదన్నారు. గతంలో అలవెన్సులు, ఓడిలను బస్ క్యాష్ నుంచి చెల్లించేవారని, అయితే గత ఐదు నెలలుగా చెల్లించడం లేదని తెలిపారు. శుక్రవారం జరిగే భోజన విరామ నిరసన కార్యక్రమాలను, గేట్ మీటింగ్‌లను జయప్రదం చేయాలని కోరారు.

మాటలు కాదు... చేతలు కావాలి

- వలంటీర్ల వ్యవస్థ పేదలను పీడించడానికా?
- తక్షణం పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి
- 'అనంత' సత్యాగ్రహ దీక్షలో వి శ్రీనివాసరావు



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో పేదలకు, పెద్దలకు మధ్య పోరుసాగుతోందంటూ ముఖ్యమంత్రి మాటలు చెప్పడం కాదు... పేదల సమస్యలు తక్షణం పరిష్కరించి చేతల్లో చూపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన ఉండడం లేదని విమర్శించారు. పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 30 గంటల సత్యాగ్రహ దీక్షను ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదల పక్షమైతే ఇంతమంది పేదలు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాల్సి వస్తోందని ప్రశ్నించారు. పేదలకు తక్షణం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అంతా చేస్తున్నట్టు చెబుతూ ఆచరణలో పెట్టుబడిదారులకు వేల ఎకరాల భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు. అనంతపురం జిల్లాలో అదానీ మొదలుకుని పెద్దపెద్ద సంస్థలకు 42 వేల ఎకరాల భూములను కట్టబెట్టారన్నారు. ఇక్కడి పేదలకు మాత్రం 42 గజాల భూమి ఇవ్వడానికి కూడా చేతులు రావడం లేదని విమర్శించారు. అనంతపురం నగరం పరిధిలోనే 12 కాలనీల్లో వేలాది మంది నిరుపేదలు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్నా, వారికి ఇంటి పట్టా ఇవ్వడం లేదన్నారు. గడపగడపకూ సేవలందిస్తామంటూ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వానికి ఈ సమస్యలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు మేలు చేయడం కంటే ఆందోళనలకు వెళ్లిన వారికి సంక్షేమ పథకాల్లో కోతలు పెట్టేందుకు ఎక్కువ ఉపయోగపడుతోందని, ప్రజలను పీడించే వ్యవస్థగా మారుతోందని దుయ్యబట్టారు. ఇంకోవైపు కేంద్రంలోని బిజెపి కూడా అంబానీ, అదానీలకు మేలు చేసే విధానాలనే అవలంబిస్తోందన్నారు. హిడెన్‌బర్గ్ నివేదికతో అదానీ తప్పుడు లెక్కలు బయటకొచ్చాయని తెలిపారు. అదానీ సంస్థల్లో పెట్టుబడులకు ఎస్‌బిఐ, ఎల్‌ఐసి వంటి ప్రభుత్వరంగ సంస్థల నుంచి కూడా అప్పులిచ్చారన్నారు. ఈ సంస్థ ఇప్పుడు నష్టపోతే జరిగే నష్టం అదానీకి కాదని, ఎస్‌బిఐ, ఎల్‌ఐసిలకని తెలిపారు. ఈ రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పేదలకు కాకుండా పెద్దలకు అనుకూలమైన విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. సత్యాగ్రహ దీక్షలో పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు పాల్గొని మద్దతు తెలిపారు. పేదల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లాలోని పేదలు పాల్గొన్నారు. సత్యాగ్రహ దీక్ష వద్ద రోడ్డుపై నాయకులు, పేదలు భోజనాలు చేశారు.

క్షేత్రస్థాయిలో సర్పంచులే కీలకం

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కీలక బాధ్యత సర్పంచులదేనని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సర్పంచులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సజ్జలకు వివరించారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, మిల్క్ సెంటర్లు వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో గ్రామాల స్వరూపమే మారిపోయిందన్నారు. పార్టీ ఆధ్వర్యంలోనే సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల ప్రోగ్రాం వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి మాట్లాడారు.

పెత్తందారులను అరెస్టు చేయాలని ధర్నా

ఆర్‌సి భూములను దళితులకు కేటాయించాలి : రమాదేవి


తెనాలి ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న రమాదేవి

ప్రజాశక్తి -భట్టిప్రోలు, తెనాలి

బాపట్ల జిల్లా చింతల్లాంక, పెదలంక గ్రామాల దళితులపై దాడికి పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కొల్లూరు తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం దళితులు ధర్నా నిర్వహించారు. నదీపరివాహక (ఆర్‌సి) భూములను దళితులకు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. ధర్నాకు సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నదీ పరివాహక భూములను సాగు చేసుకునేందుకు సిద్ధపడ్డ దళితులపై పెత్తందారులు దాడికి పాల్పడం సిగ్గుచేటని తెలిపారు. రూ.కోట్లాది రూపాయల ఇసుకను దోసుకునే వారిని వదిలేసి భుక్తి కోసం భూమిని సాగు చేసుకొనే దళితుల పట్ల పోలీసులు, రెవెన్యూ అధికారులు బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పెత్తందారుల దాడిలో గాయపడి, తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు తోడేటి రాజేష్, గుంటూరు ఏసోబు, తోడేటి రవిని రమాదేవి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దళితులపై దాడులకు పాల్పడిన పెత్తందార్లపై హత్యాయత్నం కేసుతోపాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడుల సందర్భంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని, దాడికి పాల్పడిన నిందితులపై ఇంకా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. దళితులపైనా వైసిపి దాష్టీకం కొనసాగుతోందన్నారు. బాధితులకు అండగా సిపిఎం ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, బి.అగస్టీన్ తదితరులున్నారు.

నేను వైసిపిలో పనిచేయలేను

- జగన్ ఆదేశాలతోనే నా ఫోన్ ట్యాపింగ్
- కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తా : ఎంఎల్ఎ కోటంరెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

'నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేదానికి నా వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయి. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే నా ఫోన్ ట్యాపింగ్ జరిగింది. నాపై నమ్మకం లేకుండా అవమానకరంగా వ్యవహరించిన వైసిపిలో ఇక పనిచేయలేను' అని, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నా ఫోన్‌ను ట్యాపింగ్ చేయడంపై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తున్నానని చెప్పారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల తాను మీడియా సమావేశం ఏర్పాటు చేయగా, అక్కడకు వచ్చిన మీడియా, పోలీసుల వద్ద నా ఆవేదన వ్యక్తం చేశానని చెప్పారు. నా ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని చెప్పానని, అది అధికారిక ప్రెస్‌మీట్ కాదని పేర్కొన్నారు. ఏం జరిగిందో పార్టీ పెద్ద సంజాయిషీ అడిగుంటే ఇచ్చేవాడినని, అలాకాకుండా నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి కొత్త ఇన్‌ఛార్జిని ప్రకటిస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. బారా షాహిద్ దర్గాకు జగన్ నిధులు మంజూరు చేసినా ఆర్థిక శాఖ విడుదల చేయలేదని, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తీరును విమర్శించానే తప్ప, పార్టీని విమర్శించలేదని తెలిపారు. తాను ఐ ఫోన్ వాడుతున్నానని, నా మిత్రుడైన కాంట్రాక్టర్ లంకా రామశివారెడ్డి ఫోన్ చేస్తే మాట్లాడానని తెలిపారు. నా మిత్రుడు కూడా ఐ ఫోనే వాడుతున్నాడని చెప్పారు. మా మధ్య జరిగిన సంభాషణను మా ఇద్దరిలో ఏ ఒక్కరిమీ రికార్డు చేయలేదని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజి సీతారామాంజనేయులు ఫోన్ చేసి, జగన్‌కు నీపై ప్రేమ ఉందని, ఎందుకు అలా మాట్లాడుతున్నావని నన్ను బెదిరించే పనిచేశారని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. నాకు, మా మిత్రుడికి మధ్య ఐ ఫోన్లలో జరిగిన సంభాషణను ఐజి తనకు పంపారని తెలిపారు. నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే దానికి ఇంతకంటే ఆధారం ఇంకేమి కావాలని అన్నారు. రెండు రోజులుగా 35 మంది ఎంఎల్ఎలు, నలుగురు ఎంపిలు, ఇద్దరు మంత్రులు తనకు ఫోన్ చేసి బాధపడ్డారని తెలిపారు. మా ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని వారు కూడా ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. తనకు టిడిపి నుంచి పోటీ చేయాలని ఉందని వారితో చెప్పానని, చంద్రబాబునాయుడు టికెట్ ఇస్తే నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడిపిలోకి వెళ్లేందుకే ... : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపిలో చేరేందుకే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి టిడిపిలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏముంటుందన్నారు. ఎవరి ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. మంత్రి పదవి రాలేదని శ్రీధర్‌రెడ్డికి అసంతృప్తి ఉందన్నారు. ఇతర పార్టీల నాయకులను ఎలా లాక్కోవాలో చంద్రబాబుకు బాగా తెలుసునని వ్యాఖ్యానించారు.

విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

ప్రజాశక్తి - పాడేరు ఏజెన్సీ విలేకర్ల బృందం

పాడేరు ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన రిలే దీక్షల భగ్నంపై ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాల నేతలు బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. పాడేరు పట్టణంలో విద్యా సంస్థలు మూతపడ్డాయి. ప్రాక్టికల్ పరీక్షలున్న కళాశాలలకు బంద్ నుంచి మినహాయింపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వైసిపి ది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి, పలమనేరు (చిత్తూరు జిల్లా)

వైసిపిది రైతు వ్యతిరేక ప్రభుత్వమని నారా లోకేష్ ఆరోపించారు. తాము అధికారంలో వచ్చిన వెంటనే వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని ఇల్లూరు గ్రామం నుంచి బుధవారం ఉదయం 6వ రోజు యువగళం పాదయాత్రను మొదలుపెట్టారు. ముందుగా కొంత సేపు విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. అనంతరం మండలంలోని సాకే ఊరులో చెరకు రైతు వెంకటరమణతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బేలుపల్లి క్రాస్ సమీపంలో వాల్మీకులతో, పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లిలో మహిళలతో సమావేశమయ్యారు. నక్కపల్లి గ్రామంలో భూముల రీసర్వే సరిహద్దు రాళ్లను పరిశీలించారు. ఈ యాత్రలో లోకేష్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర లేక రైతులు పడుతున్న ఇబ్బందులు పడుతున్నారని, వైసిపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు కారణంగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వం వాల్మీకులకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. 45 ఏళ్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మహిళలకు పెన్షన్లు ఇస్తామని చెప్పి ఇచ్చాడా.. అని ప్రశ్నించారు. సంపూర్ణ మద్య నిషేధం అని చెప్పి కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలు బలిగొంటున్నారని ఆరోపించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వాడు రాష్ట్ర మహిళలకు ఏం న్యాయం చేస్తాడని విమర్శించారు. చంద్రబాబు రూ.20వేల కోట్లు పసుపు కుంకుమ కింద ఇచ్చారని, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, పండుగ కానుకలు ఇచ్చామని, నేడు అవేవీ లేవన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల, మహిళల, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సిఎం ఎక్కడ నుంచి పాలిస్తే అదే రాజధాని

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిఎం ఎక్కడ నుంచి పాలిస్తే అదే రాష్ట్ర రాజధాని అవుతుందని, విశాఖ రాజధానిగా అక్కడ్నుంచే పాలిస్తానని ప్రకటించడంపై రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాజధానిగా ఏర్పాటుతో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కోటంరెడ్డి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతున్నారంటున్న ఎమ్మెల్యేల పేర్లు ఆయన బయటపెట్టాలన్నారు.

మార్చిలోనే అసెంబ్లీ భేటీ : బుగ్గన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్కడుంటే అదే ప్రధాన పాలనా కేంద్రంగా ఉంటుందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు మార్చిలోనే జరుగుతాని స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో నవరత్నాలపైనే ఫోకస్ ఉంటుందని వ్యాఖ్యానించారు.

మిర్చి యార్డులో వ్యాపారి కిడ్నాప్, విడుదల

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో వ్యాపారి పొత్తూరి శివనరేంద్ర కుమార్ కిడ్నాప్ బుధవారం కలకలం రేపింది. కిడ్నాపర్లు మార్గమధ్యలో అతన్ని కొట్టి, దోర్నాల వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. అక్కడ నుంచి నరేంద్ర మరో వాహనంలో గుంటూరు చేరుకుని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆరుగురు వచ్చి తనను అడ్డగించి కారులో కిడ్నాప్ చేశారని తెలిపారు. రూ.కోటిన్నర డిమాండ్ చేశారని చెప్పారు. దీని వెనుక మిర్చి వ్యాపారి బర్మా వెంకట్రావు హస్తం ఉందని ఆరోపించారు. వెంకటరావు కోటప్పకొండ వద్దకు వచ్చి కిడ్నాపర్లతో కలిశాడని, వారి దాడితో తనకు గాయాలు కావడంతో చొక్కా మార్చేందుకు వినుకొండ వద్ద కిడ్నాపర్లు కారు ఆపారని అక్కడ నుంచి పోలీసులు అనుసరించడంతో తనను దోర్నాల వద్ద వదలి వెళ్లిపోయారని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నరేంద్రకుమార్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి అనుచరుడు, వెంకట్రావు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు అనుచరుడు కావడంతో ఈ కిడ్నాప్ వ్యవహారం అధికార పార్టీలో కలకలం రేపుతోంది.


రాజమహేంద్రవరం సభలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రత్యేక హోదాతోనే యువతకు భవిష్యత్తు

- యువజన, విద్యార్థి సంఘాల యాత్రలో వక్తలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రత్యేక హోదాపై యువత భవిష్యత్తు ఆధారపడి ఉందని, విభజన హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు యువత సమరశంఖం పూరించాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమర యాత్ర బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసిందన్నారు. గడిచిన ఎనిమిదన్నరేళ్లలో విభజన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. విభజన హామీల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం యువజన విద్యార్థి సంఘాల సమర యాత్రకు సిపిఎం తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును అదానీకి కట్టబెట్టాలని ప్రధాని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అంటూ బిజెపి నేతలు వాఖ్యానించడం శోచనీయం అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, అల్లూరి సీతారామరాజు మేనల్లుడు సత్తిరాజు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి పాల్గొన్నారు. ఈ యాత్ర రాజమండ్రి, కాకినాడ మీదుగా అనకాపల్లికి చేరుకుంది.

- **ఈ నెల 11 నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరవ్వాలని సిఎం జగన్‌ను శ్రీశైలం ఆలయ సిబ్బంది బుధవారం ఆహ్వానించారు.**



ఒక్క మాటా లేదు... కేటాయింపూ లేదు

కార్మికుల పట్ల మోడీ సర్కారు మొండివైఖరి



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌కు సమర్పించిన కేంద్ర బడ్జెట్ కార్మికులకు మొండిచేయి చూపించింది. వారి సంక్షేమం కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దేశం ఎదుర్కొంటున్న భయంకరమైన ఆర్థిక పరిస్థితి గురించి ఒక్క ప్రస్తావన కూడా లేదు. 2022-23లో జిడిపి 6.5శాతం మేర క్షీణిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇలా వరుసగా నాలుగేళ్ల పాటు వృద్ధిరేటు క్షీణించడమన్నది గతంలో ఎన్నడూ లేదు. తయారీ రంగం అభివృద్ధికి నోచుకోలేదు. ఉద్యోగాలు కోల్పోవడం, కార్మికుల పని పరిస్థితులు, ప్రజల జీవన పరిస్థితులు అధ్వానంగా మారడం వంటి అంశాల గురించి బడ్జెట్‌లో వూసే లేదు. కార్మికులు మొత్తంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణ సమస్యలను ప్రస్తావించ లేదు. అంతర్జాతీయ మాంద్యం కారణంగా ఎగుమతుల్లో అభివృద్ధికి నోచుకోలేదు. కరంట్ అకౌంట్ లోటు పెరుగుతోందని, రూపాయి విలువ క్షీణిస్తోందంటూ ఆర్థిక సర్వే ప్రస్తావించినటువంటి రిస్కుల గురించి ప్రస్తావించడంలో కూడా బడ్జెట్ విఫలమైంది.

పెట్రోలియం సబ్సిడీలో తీవ్ర కోత కారణంగా ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలు దారుణంగా దెబ్బతింటాయి. ఫలితంగా ధరలు విపరీతంగా పెరుగుతాయి. లక్షలాదిమంది అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆరోగ్య సేవా, విద్యా రంగ కార్యకర్తలు ఇలా లక్షలాదిమంది కార్మికుల వేతనాల మెరుగుదల, వారి ప్రయోజనాల గురించి బడ్జెట్ పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, వ్యవసాయ రంగానికి ఊతమిస్తామని ప్రకటించిన కేంద్రం వ్యవసాయ రంగానికి సంబంధించి కూడా దారుణంగా కోతలు విధించింది.

రాజకీయ బూటకం : సిఐటియు విమర్శ

కేంద్ర బడ్జెట్ కేవలం రాజకీయ బూటకం తప్ప మరొకటి కాదని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు. అమృత కాలంలో పెట్టిన బడ్జెట్ ప్రజలకు విషపూరితంగా మారిందని వ్యాఖ్యానించారు. ఉపాధి కల్పన, చిన్న, మధ్య తరహా ఆర్థిక సంస్థలకు తోడ్పాటు గురించి బడ్జెట్‌లో పేర్కొనలేదని అన్నారు. సామాన్యులకు జిఎస్‌టి నుండి ఎలాంటి ఉపశమనాన్ని కలిగించలేదన్నారు. ఈ ప్రజా వ్యతిరేక, కోతల బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని, పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల వద్ద నిరసనలు నిర్వహించాలని సిఐటియు తన శాఖలన్నింటికీ పిలుపిచ్చింది.

దేశ ప్రజలకు అన్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్

దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు

ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి. వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్ 90 శాతం దేశ ప్రజానీకానికి, తెలుగు ప్రజలకు అన్యాయం చేసేలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. బుధవారం నాడిక్కడ ఆయన కేంద్ర బడ్జెట్ పై మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి దాదాపు రూ.30 వేల కోట్లు (45 శాతం) తగ్గించారని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం జరిగిందని అన్నారు. సబ్సిడిలకు భారీగా కోత పెట్టారని పేర్కొన్నారు. ఎరువులకు రూ.75 వేల కోట్లు తగ్గించారని, అందులో ఒక్క యూరియాకే రూ.15 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. ఆహార భద్రతకి రూ.90 వేల కోట్లు తగ్గించారని, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు తగ్గించారని విమర్శించారు. సామాన్య ప్రజానీకాన్ని, గ్రామీణ భారతాన్ని విస్మరించారని అన్నారు. బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకి అన్యాయం జరిగిందని అన్నారు. ఆదాయ ఆర్జనలో తెలుగు రాష్ట్రాలు ముందున్నాయని తెలిపారు. కర్ణాటకలో ఎన్నికలు ఉండటంతో అధికంగా కేటాయించారని విమర్శించారు. విభజన హామీలు, ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు నిరసన చేపడతాయని తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులను విస్మరించడాన్ని నిరసిస్తూ ఎఐఎడబ్ల్యుయు ఒక ప్రకటన విడుదల చేసింది.

బడ్జెట్‌లో ఐసిడిఎస్‌పై వివక్ష

- స్త్రీ, శిశు సంక్షేమానికి మొండిచేయి
- బిజెపి, ఎన్‌డిఎ ఎంపిల నియోజకవర్గాల్లో ఆందోళనలకు ఎఐఎఫ్‌ఎడబ్ల్యూహెచ్ పిలుపు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్‌పై వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. స్త్రీ, శిశు సంక్షేమానికి నిధుల కేటాయింపులో వివక్ష నెలకొంది. పేదరికం, పోషకాహారలోపం, ఆకలి సమస్యలను పూర్తిగా విస్మరించింది. సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 పథకాలకు నామమాత్రంగా రూ.20,263.07 కోట్ల నుంచి రూ.20,554.31 కోట్లకు పెంచారు. కేవలం రూ. 291 కోట్లు మాత్రమే పెరిగింది. లాక్‌డౌన్ కారణంగా పెరిగిన లబ్ధిదారుల సంఖ్య, పెరిగిన ద్రవ్యోల్బణంతో పోల్చుకుంటే ఇది నిజానికి పెరుగుదలే కాదు. ఆహార భద్రత చట్టం కింద ఎఫ్‌సిఐకి ఇస్తున్న ఆహార సబ్సిడీని రూ. 21,4696 కోట్లు (2022-23 బడ్జెట్‌లో సవరించి అంచనాల ప్రకారం) నుంచి రూ. 13,7207 కోట్లకు తగ్గించారు. ఈ తగ్గింపు 36 శాతం లేదా రూ. 77489 కోట్లు. ఈ ప్రభావం ఐసిడిఎస్, ఎండిఎంఎస్‌లపై పడుతుంది. గత బడ్జెట్‌లో 2 లక్షల అంగన్‌వాడీలను ఆధునీకరిస్తామని మంత్రి ప్రకటించినా, బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదు. 'మిషన్ శక్తి' కేటాయింపులను రూ.40.15 కోట్లు తగ్గించారు. జాతీయ హెల్త్ మిషన్ కోసం కేటాయింపులను రూ. 375 కోట్లు తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ 37160 కోట్లుగా ఉన్న కేటాయింపులను, ఈ 2023-24 బడ్జెట్‌లో రూ.36785 కోట్లుకు తగ్గించారు.



పిఎం పోషణ్ పథకానికి కేటాయింపులను రూ. 1200 కోట్లు తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ. 12800 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 11600 కోట్లు తగ్గాయి. సామాజిక భద్రత, పెన్షన్లకు కేటాయింపులను భారీగా తగ్గించారు.

ప్రజల్ని మోసం చేసింది

కేంద్ర బడ్జెట్‌పై ఎఐఎఫ్‌ఎడబ్ల్యూహెచ్ విమర్శ

2023-24 కేంద్ర బడ్జెట్‌పై అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల సమాఖ్య (ఎఐఎఫ్‌ఎడబ్ల్యూహెచ్) మండిపడింది. స్కీమ్ వర్కర్లను, ప్రజలను మోసం చేసిందని, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, మహిళా, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించింది. బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు పెరుగుదల లేదని, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాల పెంపు లేదని విమర్శించింది. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రచారం, నిరసనలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీలకు ఎఐఎఫ్‌ఎడబ్ల్యూహెచ్ పిలుపునిచ్చింది. ఇతర స్కీమ్ వర్కర్ల ఫెడరేషన్లతో కలిసి బిజెపి, ఎన్‌డిఎ ఎంపీలు, మంత్రులను వారి నియోజకవర్గాల్లో నిలదీస్తామని హెచ్చరించింది.

కార్మిక వ్యతిరేక బడ్జెట్ : చోడవరపు శంకరరావు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ, ఎఐఆర్‌ఎఫ్ జాతీయ కోశాధికారి చోడవరపు శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన 18 నెలల డిఎ బకాయిలు చెల్లింపు ప్రస్తావన లేకపోవడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను నిరాశకు గురిచేసిందన్నారు. జాతీయ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరి డిమాండ్ గురించి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన కూడా రాలేదన్నారు. రూ.10 లక్షల వరకు ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

రైల్వే బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం

కొరవడిన ఉద్యోగుల సంక్షేమం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచెయ్యి చూపింది. బడ్జెట్‌లో విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్ ఊసే లేదు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్, కడప-బెంగళూరు లైన్, రాయదుర్గం - తుముకూరు ప్రాజెక్టు, కొవ్వూరు-నరసాపురం రైల్వే లైన్ల ఊసే బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా కనబడలేదు. 2023-24 బడ్జెట్‌లో రైల్వే రంగానికి క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.2.40 లక్షల కోట్లు కేటాయించగా, ఇందులో రూ.75 వేలకోట్లు పెట్టుబడులు, ప్రైవేటు రంగం నుంచి మరో రూ.15 వేలకోట్ల పెట్టుబడులతో పోర్టులు, బొగ్గు గనులు, ఫెర్టిలైజర్స్, ఆహార ఉత్పత్తులు రంగాలను గుర్తించి ఆయా ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టులు, హెలిపోర్టు, వాటర్ ఏరోడ్రోమ్స్ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీకి బడ్జెట్‌లో ప్రాధాన్యత నిచ్చారు. వందే భారత్ రైళ్ల కోసం రైల్వే ట్రాక్‌ల సామర్థ్యాన్ని పెంచేందుకు బడ్జెట్‌లో రూ.17,296 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. రైల్వే బడ్జెట్‌పై ప్రత్యేకంగా రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. సాగర్‌మాల కింద ఎకానమీ, సోషల్ కారిడార్‌ల కింద రైల్వే అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు.

కేటాయింపులు ఇలా..

కొత్త రైల్వే లైన్‌ల కోసం : రూ.31,850 కోట్లు
గేజ్‌మార్పిడీల కోసం రూ.4,600 కోట్లు
డబ్లింగ్ పనుల కోసం రూ.30,749 కోట్లు
సిగ్నలింగ్ కోసం రూ.6,717
రోలింగ్ స్టాక్ కోసం రూ.37,581
లెవల్ క్రాసింగ్ కోసం రూ.7 వేలకోట్లు
ఆర్‌ఓబిల కోసం : 7,400 కోట్లు
పాత ట్రాక్‌ల స్థానంలో కొత్తవి వేసేందుకు రూ.17,297 కోట్లు
సిగ్నలింగ్ వ్యవస్థ కోసం రూ.4,199 కోట్లు
విద్యుద్ధీకరణ కోసం రూ.8,070 కోట్లు
ఇతర విద్యుత్తు అవసరాల కోసం రూ.1,650 కోట్లు
ప్రొడక్షన్ పనుల కోసం రూ.4,330 కోట్లు
సిబ్బంది సంక్షేమం కోసం రూ.629.50 కోట్లు
వినియోగదారుల సేవల కోసం రూ.11.355 కోట్లు
మెట్రో పాలిటిన్ కోసం రూ.2,450 కోట్లు
రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం రూ.45 వేల కోట్లు

ద్రవ్య లోటు రూ.17.55 లక్షల కోట్లు
ఆదాయ లోటు రూ.11.1 లక్షల కోట్లు

లెక్కలు తేల్చిన కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర ఖజానా భారీ లోటుతో కొనసాగుతోంది. ముగుస్తున్న 2022-23 ఆర్థిక సంవత్సరంతోపాటు రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా లోటు కష్టాలు తప్పడం లేదు. బడ్జెట్ ప్రతిపాదనలకు మించి లోటు నమోదవుతున్నట్లు లెక్కల్లో తేలింది. తాజాగా కేంద్ర బడ్జెట్ ప్రతిపాదన నేపథ్యంలో కొత్త ఏడాది రూ.17,86,816 కోట్లు ద్రవ్య లోటు ఉంటుందని ప్రతిపాదించారు. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.16.6 లక్షల కోట్లు లోటు ఉంటుందని అంచనా వేయగా, అది చివరకు రూ.17,55,319 కోట్లుగా తేలింది.

ఇక ఆదాయ లోటు కూడా భారీగానే ఉంది. గతేడాది ఆదాయ లోటును రూ.9,90,241 కోట్లుగా ప్రతిపాదించగా, చివరకు అది రూ.11,10,546 కోట్లకు చేరుకుంది. మార్చి నుంచి ప్రారంభమయ్యే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ లోటు రూ.8,69,855 కోట్ల వరకు ఉంటుందని ప్రతిపాదించారు. ద్రవ్యలోటులో ఎక్కువగా మార్కెట్ బారోయింగ్స్ ద్వారా తీసుకున్న రుణాలే ఉన్నాయి. మొత్తం ద్రవ్యలోటులో ఈ విభాగం కింద రూ.17,58,861 కోట్లు తీసుకున్నట్లు లెక్కల్లో పేర్కొన్నారు. అలాగే చిన్న పొదుపు సంస్థలో సెక్యూరిటీల ద్వారా రూ.4,38,919 కోట్లు, స్టేట్ ప్రావిడెండ్ ఫండ్ ద్వారా రూ.20 వేల కోట్లు, ఇతర రుణాల ద్వారా రూ.79,902 కోట్లు. ఎక్స్‌టర్నల్ రుణాల ద్వారా రూ.23,874 కోట్లు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ లోటు పరిస్థితి (రూ. కోట్లలో)

విభాగం	2022-23 ప్రతిపాదన	2022-23 వాస్తవ	2023-24 అంచనా
ద్రవ్యలోటు	16,61,196	17,55,319	17,86,816
ఆదాయ లోటు	9,90,241	11,10,546	8,69,855
లోటు ప్రభావం	6,72,586	7,84,958	4,99,867
ప్రైమరీ లోటు	7,20,545	8,14,668	706,845

అమరావతి పేరు ప్రస్తావనే లేదు

- బడ్జెట్లో కేటాయింపులు లేవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిగానే ఉండాలంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్న బిజెపి నాయకులు రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం బడ్జెట్ సాక్షిగా బయటపడింది. ఈ బడ్జెట్లో కనీసం అమరావతి రాజధాని ప్రస్తావన కూడా చేయలేదు. అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్రానిదే అయినప్పటికీ నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోంది. ఎన్నికల సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపు ఉంటుందని అందరూ భావించారు. విభజన జరిగి తొమ్మిదేళ్ల గడిచిపోతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇక అమరావతి బాధ్యత కేంద్రానికి ఉండదని రైతులు చెబుతున్నారు. పట్టణాభివృద్ధిలో ప్రధాన పనుల్లో భాగంగా రూ.76,432 కోట్లు కేటాయించారు. 2022-23 బడ్జెట్లో రూ.76,549 కోట్లు కేటాయించి సవరణ బడ్జెట్లో దాన్ని రూ.74,546 కోట్లకు కుదించారు. మరలా ఇప్పుడు రెండువేల కోట్లు పెంచి చూపించారు. అలాగే అమృత్ సిటీలకు సంబంధించి గత బడ్జెట్లో రూ.14,100 కోట్లు కేటాయించి, రూ.15,300 కోట్లకు సవరించారు. ఇప్పుడు రూ.16,000 కోట్లు కేటాయించారు. వాస్తవంగా దీనిలో భాగంగానే అమరావతికీ నిధులు కేటాయించాల్సి ఉన్నా కేటాయింపులు చూపించలేదు. స్మార్ట్ సిటీ కింద అమరావతిని ప్రకటించారు. అందులోనూ కేటాయింపులు లేవు. మరోవైపు అమరావతి రాజధానిగా ఉండాలని తమ భావన అని చెబుతున్న బిజెపి నాయకులు బడ్జెట్లో కనీస కేటాయింపులు జరపడంలో తీవ్ర అన్యాయం చేశారు. పైకి ఒకటి చెబుతూ.. లోపల మాత్రం అమరావతిని ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని రైతు నాయకులు కోరుతున్నారు.

ఇంగ్లండ్‌ను కుదిపేసిన అతి పెద్ద సమ్మె

వేతనాలు పెంచాలని కోరుతూ ఉపాధ్యాయులు, ట్రైన్ డైవర్ల ఆందోళనలు

లండన్ : ఈ దశాబ్దంలోనే అతిపెద్ద వాకౌట్, సమ్మెలతో బ్రిటన్ అట్టుడుకుతోంది. విద్య, రవాణా, పౌర సేవలకు చెందిన 5 లక్షల మంది వర్కర్లు బుధవారం తమ పని ప్రదేశాల్లో వాకౌట్ చేశారు. 2011 నవంబరు30న జరిగిన పెన్షనర్ల సమ్మె తరువాత తిరిగి అంత పెద్దయెత్తున సమ్మె జరగడం ఇదే మొదటిసారి. అధిక ధరలకు వ్యతిరేకంగా రైలు డ్రైవర్లు, ఉపాధ్యాయులు, విశ్వ విద్యాలయ సిబ్బంది, సివిల్ సర్వెంట్ల సంయుక్తంగా సమ్మె చేస్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని వీరంతా నిరసనలకు దిగడంతో పాఠశాలలు మూతపడటంత పాటు, బ్రిటన్ రైల్ నెట్‌వర్క్ నిర్వీర్యమయింది. బుధవారం లండన్‌లో ఉపాధ్యాయులు మార్చ్ నిర్వహించారు. సుమారు 4,75,000 మంది యూనియన్ సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. విక్టోరియా, కానన్ స్ట్రీట్, మెరిలేబోన్, లండన్ బ్రిడ్జ్ స్టేషన్లతో సహా లండన్‌లో ప్రధాన రైలు స్టేషన్లనీ పూర్తిగా మూసివేయబడ్డాయి. ఇంగ్లండ్, వేల్స్‌ల్లో 85 శాతం పాఠశాలలు మూసివేయబడినట్లు నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ వెల్లడించింది. కాగా, ఈ సిబ్బందికి తోడుగా ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు సమ్మె చేస్తామని సరిహద్దు దళ అధికారులు తెలిపారు.

ఉన్నత విద్యాభివృద్ధికి సమిష్టి కృషి

ముగిసిన దక్షిణ భారత విశ్వ విద్యాలయాల ఉపకులపతుల సదస్సు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

ఉన్నత విద్యలో ఆశించిన మార్పులు, అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి కోరారు. ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ సెనేట్ మందిరంలో రెండు రోజులపాటు జరిగిన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సదస్సు బుధవారం ముగిసింది. చివరి రోజు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు ఎన్నో నూతన ఆలోచనలకు స్థానం కల్పించిందన్నారు. వీటిలో కొన్నింటిని త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యకు దిక్సూచిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నిలుస్తోందన్నారు. ఎయు ప్రగతి ఇతర విశ్వవిద్యాలయాలకు నూతన శక్తిని అందిస్తోందని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ సదస్సును ఆంధ్రాయూనివర్సిటీ సమర్థవంతంగా నిర్వహించిందని అభినందించారు. ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎఐయు ఉపాధ్యక్షుడు ఆచార్య జిడి.శర్మ, డాక్టర్ రమాదేవి, ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామ్మోహనరావు, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

దళితుల వ్యతిరేక బడ్జెట్

కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితుల కోసం కేటాయించిన బడ్జెట్.. గత బడ్జెట్ కన్నా తక్కువ అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిఎస్‌ఎంఎం జాతీయ కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. గతేడాది రూ.1,819.52 కోట్లు నిధులు కేటాయిస్తే, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.976.86 కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఇది దళితుల అభివృద్ధికి వ్యతిరేక బడ్జెట్‌గా మాల్యాద్రి పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు తీవ్ర అన్యాయం చేసే మనువాద మతోన్మాదుల బడ్జెట్‌గా అభివర్ణించారు.

నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చు

తిరుగుబాటు ఎమ్మెల్యేలపై ఆనం విజయ్ విమర్శ

ప్రజాశక్తి-నెల్లూరు

వైసిపిపై తిరుగుబాటు ప్రకటించిన నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిపై వైసిపి నాయకులు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి విమర్శల వర్షం కురిపించారు. బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ మాట్లాడుతూ.. పార్టీ వదిలి వెళ్లిపోవాలనుకుంటే నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చన్నారు. రౌడీ షీటర్లకు, బ్లేడు బ్యాచ్‌లకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నెల జీతాలు ఇస్తూ పార్టీ కార్యాలయంలో పోషిస్తూ ఎన్నో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్

వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. రైతాంగం, వ్యవసాయ రంగం పట్ల నిరాదరణ స్పష్టంగా కనపడిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా సమయంలో కోట్లాది మంది నిరుపేదలకు ఉపాధిని, ఆదాయాన్ని కలిగించిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు తక్కువ చూపడం క్షమార్హం కాదని తెలిపారు. గతేడాది రూ.89,400 కోట్లు కేటాయించి రూ.73 వేలకోట్లు ఖర్చు చేశారని వివరించారు. ప్రస్తుతం ఈ పథకానికి రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ఇన్‌కమ్ ట్యాక్సు, కస్టమ్స్ డ్యూటీలను తగ్గించారని, ఆ సంస్థల పట్ల ఉన్న ప్రేమ స్పష్టపరుస్తుందని విమర్శించారు.

శివాలెత్తిన శుభ్‌మన్

మూడో టి20లో న్యూజిలాండ్‌పై 168పరుగుల తేడాతో రికార్డు గెలుపు

సిరీస్ 2-1తో కైవసం

అహ్మదాబాద్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో, చివరి టి20లో టీమిండియా 168 పరుగుల తేడాతో గెలిచి రికార్డు నెలకొల్పింది. ఈ ఫార్మాట్‌లో భారత్ ఇన్ని పరుగుల తేడాతో గెలుపొందడం ఇదే ప్రథమం. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 234పరుగుల భారీస్కోర్‌ను చేసింది. యువ సంచలనం శుభ్‌మన్ గిల్(126నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 12.1 ఓవర్లలో కేవలం 66 పరుగులకే కుప్పకూలింది.

తొలుత టీమిండియా ఇన్నింగ్స్‌ను ఇషాన్ కిషన్, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అయితే కేవలం మూడు బంతులను మాత్రమే ఎదుర్కొన్న ఇషాన్ ఒక పరుగు మాత్రమే చేసి ఎల్బీగా పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత త్రిపాఠి-శుభ్‌మన్ కలిసి న్యూజిలాండ్ బౌలర్లను ఊచకోత కోశారు. ఓవైపు రాహుల్ త్రిపాఠి(44; 3సిక్సర్లు, 4ఫోర్లు) చెలరేగి ఆడగా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ బంతిని బౌండరీ లైన్‌కు తరలించడమే పనిగా పెట్టుకున్నాడు. శుభ్‌మన్ కేవలం 63 బంతుల్లో 12ఫోర్లు, 7సిక్సర్లతో 126పరుగులు చేశాడు. అలాగే టి20 కెరీర్లో తొలి సెంచరీని సాధించాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(24; ఫోర్, 2సిక్సర్లు)కి తోడు హార్దిక్ పాండ్యా(30; సిక్సర్, 4ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. కివీస్ బౌలర్లలో బ్రాస్‌వెల్, టిక్నర్, సోధి, మిచెల్ చెరో వికెట్ దక్కాయి.



గిల్ (126నాటౌట్)

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు 7పరుగులకే 4వికెట్లు కోల్పోయి తొలుతే ఓటమిని అంగీకరించింది. మిచెల్(35), సాంట్నర్(13) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగలిగారు. మిగతా బ్యాటర్స్ ఘోరంగా విఫలమయ్యారు. దీంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 12.1 ఓవర్లలో 66పరుగులకే కుప్పకూలింది. హార్దిక్‌కు నాలుగు, శివమ్ మావి, ఆర్షదీప్, ఉమ్రన్ మాలిక్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. శుభ్‌మన్‌కు, సిరీస్ హార్దిక్ పాండ్యాకు లభించాయి. దీంతో మూడు టి20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో చేజిక్కించుకుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్‌బి)బ్రాస్‌వెల్ 1, శుభ్‌మన్ (నాటౌట్) 126, త్రిపాఠి (సి)ఫెర్గుసన్ (బి)ఇష్ సోధీ 44, సూర్యకుమార్ (సి)బ్రాస్‌వెల్ (బి)టిక్నెర్ 24, హార్దిక్ (సి)బ్రాస్‌వెల్ (బి)మిఛెల్ 30, దీపక్ హుడా (నాటౌట్) 2, అదనం 7. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 234పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/87, 3/125, 4/228 **బౌలింగ్:** లిస్టర్ 4-0-42-0, బ్రాస్‌వెల్ 1-0-8-1, ఫెర్గుసన్ 4-0-54-0, టిక్నెర్ 3-0-50-1, ఇష్ సోధీ 3-0-34-1, సాంట్నర్ 4-0-37-0, మిఛెల్ 1-0-6-1,

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 3, కాన్వే (సి)హార్దిక్ (బి)ఆర్షదీప్ 1, ఛాప్మన్ (సి)ఇషాన్ (బి)ఆర్షదీప్ 0, ఫిలిప్స్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 2, మిఛెల్ (సి)శివమ్ మావి (బి)ఉమ్రన్ మాలిక్ 35, బ్రాస్‌వెల్ (బి)ఉమ్రన్ మాలిక్ 8, సాంట్నర్ (సి)సూర్యకుమార్ (బి)శివమ్ మావి 13, ఇష్ సోధీ (సి)త్రిపాఠి (బి)శివమ్ మావి 0, ఫెర్గుసన్ (సి)ఉమ్రన్ మాలిక్ (బి)హార్దిక్ 0, టిక్నెర్ (సి)ఇషాన్ (బి)హార్దిక్ 1, లిస్టెర్ (నాటౌట్) 0, అదనం 3. (12.1 ఓవర్లలో ఆలౌట్) 66పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/4, 3/5, 4/7, 5/21, 6/53, 7/53, 8/54, 9/66 **బౌలింగ్ :** హార్దిక్ 4-0-16-4, ఆర్షదీప్ 3-0-16-2, ఉమ్రన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ మావి 2-0-12-2.

క్రీడలకూ కంటితుడుపే..!

'ఖేలో ఇండియా'కు అధిక నిధులు

ఆసియా, పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతకు నామమాత్రమే..

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,397.32కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ప్రకటించిన బడ్జెట్‌లలో ఇదే అత్యధికమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఆ నిధులు ఏ మూలకూ సరిపోవని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. గత ఏడాది క్రీడలకు రూ.3,062కోట్ల బడ్జెట్ ప్రకటించగా.. ఈసారి రూ.3,397.32కోట్లుగా అంచనా వేసింది. ఈ ఏడాది చైనా వేదికగా ఆసియా క్రీడలు జరగనుండగా.. వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ జరగనున్నాయి. బడ్జెట్‌కు కేటాయించిన మొత్తంలో ఖేలో ఇండియా(నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్)కే రూ.1,045కోట్లు కేటాయించారు. 2022లో ఖేలో ఇండియాకు కేటాయించిన మొత్తం (రూ.606కోట్లు)తో పోల్చిచూస్తే ఇది దాదాపు రెండింతలు. అలాగే నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్(ఎన్‌ఎస్‌ఎఫ్స్)కు గత బడ్జెట్‌లో 280 కోట్లు కేటాయించగా.. ఈసారి దాన్ని రూ.325 కోట్లకు పెంపుదల చేశారు. అలాగే నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(నాడా), ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(వాడా)తోపాటు నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ(ఎన్‌డిటిఎల్)కు ఈ కేటాయింపుల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా నాడాకు రూ.21.73కోట్లు, ఎన్‌డిటిఎల్‌కు రూ.19.50కోట్లుతోపాటు వాడాకు రూ.4కోట్లు మంజూరు చేసింది. పైవన్నీ పోను మిగిలిన మొత్తం క్రీడాకారులను సన్నద్ధం సరిపోవని వారంటున్నారు.

	నేషనల్ ఫెడరేషన్స్	ఖేలో ఇండియా	కేంద్రప్రభుత్వ స్కీమ్	క్రీడాభివృద్ధికి నిధి
2022	రూ.280కోట్లు	రూ.974కోట్లు	రూ.1832.50కోట్లు	రూ.73కోట్లు
2023	రూ.325కోట్లు	రూ.1000కోట్లు	రూ.1913.51కోట్లు	రూ.62కోట్లు

ఆంధ్ర 379 ఆలౌట్

ఇండోర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 379పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 262పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రప్రదేశ్ జట్టు మరో 117పరుగులు జతచేసి 8వికెట్లు కోల్పోయింది. కీపర్ రికీ బుయ్(149), కరణ్ షిండే(110) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ ఔటయ్యాక లలిత్ మోహన్(22) మినహా మరో బ్యాటర్ రాణించలేకపోయారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఘోరంగా విఫలమయ్యారు. అనుభవ్ అగర్వాల్‌కు నాలుగు, కార్తికేయ, గౌరవ్ యాదవ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలిఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. శుభమ్ శర్మ(51) అర్ధసెంచరీకి తోడు ఓపెనర్లు యశ్ దూబే (20), హిమాన్షు(22), పటీధర్(20) ఫర్వాలేదనిపించారు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కెప్టెన్ శ్రీవాత్సవ(20), అనుభవ్ అగర్వాల్(0) క్రీజ్‌లో ఉన్నారు. శశికాంత్‌కు రెండు, నితీశ్ కుమార్, పృథ్వీరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68